
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 29 జూలై 2025
5



గిరిజన ఆశ్రమ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- పరీక్ష రాస్తూ అపస్మారక స్థితికి.. ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతిచెందినట్టు వైద్యుల నిర్ధారణ
- ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంలో ఘటన
- ప్రభుత్వాస్పత్రి ఎదుట తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ధర్నా
- మృతదేహాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్, అధికారులు

7



‘పీఎంశ్రీ’ రెండో విడత
నిధుల విడుదల

- ఖమ్మం జిల్లాలో 28 స్కూళ్లకు రూ.11.60 లక్షలు..
- భద్రాద్రి జిల్లాలో 24 బడులకు రూ.15 లక్షలు మంజూరు

ఖమ్మం ఖానాపురం హవేలీ / కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయి విద్యతో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) అనే సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత నిధులను సోమవారం రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ విడుదల చేశారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి 28 పాఠశాలలకు రూ.11.60లక్షలు, భద్రాద్రి జిల్లాలో 24స్కూళ్లకు రూ.15లక్షలు విడుదల చేశారు. ఈ నిధులను పాఠశాలల్లో భవనాల మరమ్మతులకు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, గదుల నిర్మాణానికి వాడాలని పీడీ సూచించారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా దీన్ని ప్రవేశపెట్టింది. ఈ పీఎంశ్రీ నిధులతో పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరగనుంది. పూర్తి స్థాయి నిధులు మంజూరై అభివృద్ధి పనులు పూర్తయి పరికరాలు అందుబాటులోకి వస్తే ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలల తరహాలో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం మంజూరైన నిధులు ల్యాబ్‌లు, నూతన గదుల నిర్మాణం, మరమ్మతుల కోసం వాడుకోవాల్సి ఉంటుంది. మొదటి దశలో విడుదలైన నిధులతో అసంపూర్తిగా ఉన్న పనులను రెండో విడతలో విడుదలైన నిధులతో పూర్తి చేయాలని అధికారులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

స్థానిక ఎన్నికలపైనే గురి



- నేడు జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు రాక
- ఘన స్వాగతానికి పార్టీ శ్రేణుల ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో ‘కమలం’ వికసించేనా?

6

పర్యాటక హబ్‌కు..
ప్రణాళికలు

- ఉమ్మడి జిల్లా దర్శనీయ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి
- టెంపుల్ టూరిజం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- వెలుగుమట్లలో 500 ఎకరాల్లో ‘ఎకో’ రూపకల్పన
- హైదరాబాద్‌లో మంత్రులు తుమ్మల, జూపల్లి సమీక్ష



జిల్లా పర్యాటక రంగంపై సమీక్షిస్తున్న మంత్రులు తుమ్మల, జూపల్లి




ఖమ్మం, జూలై 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఉమ్మడి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలుగు రాష్ట్రాలకు గుమ్మంగా.. తెలంగాణకు తలమానికంగా ఉండే ఖమ్మం, భద్రాద్రి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వారు పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఉమ్మడి జిల్లా పర్యాటకంపై పర్యాటక శాఖ అధికారులకు దశ, దిశ నిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాలో వివిధ చారిత్రాత్మక ప్రదేశాలతో పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని, ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

అధికారులకు కీలక సూచనలు..

టెంపుల్ టూరిజంలో భాగంగా పలు ఆలయాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని మంత్రులు అధికారులకు కీలక సూచనలు చేశారు. నేలకొండపల్లి బౌద్ధస్థూపం, పర్ణశాల, భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు రచించాలని, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని తీసుకోవాలని కోరారు. అలాగే ఎకో టూరిజంలో కిన్నెరసాని ప్రాజెక్టు, కొత్తగూడెం వద్ద హరితహోటల్, తల్లాడ మండలంలో కనకగిరి హిల్స్, వైరా రిజర్వాయర్, వెలుగుమట్ల అర్బన్‌పార్కులో 500 ఎకరాల్లో అధునాతన వసతులు కల్పించాలని సూచించారు. ఖమ్మం ఖిల్లా వద్ద నిర్మించే రోప్‌వే నగరానికి మణిహారంగా నిలవాలని, ఖమ్మంలో కూడా సరికొత్తగా హరిత హోటల్‌ను త్వరితగతిన నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇందుకు అవసరమైన స్థలం గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అనుకూలమైనవాతావరణ,ం ప్రదేశాలు, చారిత్రాత్మక కట్టడాలు, ఆలయాలున్నాయని, వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మలతో పాటు (మిగతా 6వ పేజీలో)

తెలుగు రాష్ట్రాలకు సరిహద్దున ఉన్న ఉమ్మడి ఖమ్మం పర్యాటక అభివృద్ధి అంశం మరోమారు తెరపైకి వచ్చింది. తెలంగాణకు తలమానికంగా ఉన్న ఉమ్మడి జిల్లాలోని పలు దర్శనీయ ప్రాంతాలను తీర్చిదిద్దడంపై రాష్ట్ర సర్కారు దృష్టి పెట్టింది. ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ సచివాలయంలో పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలతో పర్యాటక హబ్‌ను అభివృద్ధి చేయాలని.. అలాగే ఆలయాలతో టెంపుల్ టూరిజం, పార్కులు, ఇతర పర్యావరణ సంబంధిత ప్రాంతాలతో ఎకో టూరిజం అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



ఖమ్మంలో నిర్మించే హరిత హోటల్ నమూనా



ఖమ్మం ఖిలాపైకి రోప్ వే నమూనా

ముదిగొండ భూ పోరాటం
చిరస్మరణీయం

- భూమి ఉన్నంతవరకు ఎర్రజెండా పోరాటాలు కొనసాగుతాయి
- అమరుల వర్ధంతి సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని



సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ముదిగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూ పోరాటాల చరిత్రలో ముదిగొండ పోరాటం చిరస్మరణీయమని, భూమి ఉన్నంతవరకు ఎర్రజెండా పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా ముదిగొండలో జరిగిన భూపోరాట అమరవీరుల 18వ వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరుల స్తూపం వద్ద చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం (మిగతా 6వ పేజీలో)

సవరించిన అంచనాలకు..
ఆమోదం



(ఫైల్)

రూ.19,325కోట్లకు పెరిగిన ‘సీతారామ’ వ్యయం

- శరవేగంగా సాగనున్న మిగులు పనులు
- సాగులోకి 3.29 లక్షల ఎకరాలు
- సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు తుమ్మల కృతజ్ఞతలు
- పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం : తుమ్మల

ఖమ్మం, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సీతారామ లిఫ్టు ఇరిగేషన్‌కు సంబంధించి సవరించిన అంచనాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. దీంతో సీతారామ ప్రాజెక్టు మిగులు పనులు శరవేగంగా జరగబోతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.13,057కోట్లతో ఈ పనులు చేపట్టగా ఆ వ్యయం అంచనా ప్రస్తుతం రూ.19,325కోట్లకు చేరింది. దీంతో విషయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పెరిగిన అంచనాలకు ఆరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇదే క్రమంలో సోమవారం హైదరాబాద్‌లో జరిగిన మంత్రివర్గ భేటీలో దీనికి ఆమోదం లభించింది. దీంతో సీతారామకు నిధుల సమస్య తప్పింది. ఇప్పటికే రాజీవ్ లింక్‌కెనాల్ ద్వారా సాగర్‌ఆయకట్టుకు అనుసంధానం చేసి ఇటీవల వర్షాభావ నేపథ్యంలో వైరా రిజర్వాయర్‌కు కల్లూరు వైపుగా గోదావరిజలాలను పంపి పంటలను కాపాడగలిగారు. 2026 ఆగస్టు 15కల్లా సీతారామ పనులన్నీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి గతేడాది ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు ప్రారంభం సమయంలో వైరా జరిగిన సభలో హామీ ఇచ్చారు. ప్రస్తుతం సీతారామ ప్రధాన కాలువతో పాటు పాలేరు లింక్‌కెనాల్, సత్తుపల్లి ట్రంక్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీనికితోడు ఉమ్మడి జిల్లాలో పలు నియోజకవర్గాల్లో రూ.3,500కోట్లతో ఎనిమిది డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. ఇందుకు సంబంధించిన భూసేకరణ జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు పెరిగిన అంచనాలకు ప్రభుత్వం ఆమోదం లేకపోవడంతో సీతారామ ప్రాజెక్టు పరిస్థితి ‘ముందు నుయ్యి.. వెనుక గొయ్యి’ చందంగా మారింది. పరిస్థితిని గమనించిన మంత్రి తుమ్మల సీఎం, మంత్రికి విజ్ఞప్తి చేయడం వారు సానుకూలంగా స్పందించడం, మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని 11 నియోజకవర్గాలు, 31 మండలాల్లో 3.29లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రాబోతోంది. ప్రస్తుతం సాగర్‌తో పాటు పలు చెరువులు కింద 3.45వేల ఎకరాలు స్థిరీకరణ జరుగుతోంది. ఇప్పుడు సీతారామకు నిధుల సమస్య తీరడంతో (మిగతా 6వ పేజీలో)

షటిల్ ఆడుతూ..
కుప్పకూలాడు..

- స్టేడియంలోనే కన్నుమూసిన తల్లాడ యువకుడు
- హైదరాబాద్‌లో ఘటన



గుండ్ల రాకేష్ (ఫైల్)

తల్లాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి షటిల్ ఆడుతూ ఓ యువకుడు కుప్పకూలిన సంఘటన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టేడియంలో జరగ్గా.. ఈ ఘటన మృతుడి స్వగ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఖమ్మంజిల్లా తల్లాడ మాజీ ఉప సర్పంచ్ గుండ్ల వెంకటి-రాధమ్మ దంపతుల కుమారుడైన గుండ్ల రాకేష్ (26) డిగ్రీ చదివి.. హైదరాబాద్‌లోని ఓ ఈవీ వాహన కంపెనీలో పనిచేస్తున్నాడు. విద్యార్థి దశ నుంచే షటిల్ ఆడే రాకేష్.. ఆదివారం సెలవు దినం కావడంతో రాత్రి సమయంలో నాగోల్‌లోని (మిగతా 6వ పేజీలో)

సర్కారీ బడుల్లో.. ప్రీ ప్రైమరీ

- ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది నుంచే అమలు
- జిల్లాలో 28 పాఠశాలల్లో బోధనకు ఏర్పాట్లు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక ప్రీ స్కూల్ విద్య లేనట్టేనా?

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే ఇక నుంచి సర్కారీ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక (ప్రీప్రైమరీ) విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వ బడులకు వచ్చే పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్య కూడా అందనుంది. దీన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయనుండగా.. జిల్లాలో కొత్తగా 28 పాఠశాలలను ఎంపిక చేసి.. తరగతుల బోధనకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం అనుమతులు కూడా ఇచ్చింది. గతంలో మధిర మండలం సిరిపురం, సత్తుపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే ప్రీ ప్రైమరీ విద్యను బోధిస్తుండగా.. ఈ ఏడాది నుంచి మరో 28 పాఠశాలలను కూడా ఎంపిక చేసింది. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టగా.. పాఠశాలలకు వచ్చే విద్యార్థులను ఆకట్టుకునేలా ఆయా పాఠశాలలను ఆకర్షణీయంగా మార్చనున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 830 ప్రాథమిక పాఠశాలలు



ఉండగా గతంలో రెండు ఇప్పుడు 28 పాఠశాలల్లో మాత్రమే ప్రీప్రైమరీ విద్యను అందుబాటులోకి తెస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడిని, ఆయాను కలెక్టర్ ఆధ్వర్యంలో 10నెలల కాలపరిమితితో వేతనం చెల్లించేలా స్థానికులను నియమించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఆట పాటలతో..

జిల్లాలోని ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చిన్నారులను ఆకట్టుకునేలా వివిధ రకాల సామగ్రిని అందజేసి ఆటాపాటలతో విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆట వస్తువులు, బొమ్మలను అందించనుంది. పాఠశాలల భవనాలు, తరగతి గదులను రంగులు, చిత్రపటాలతో అందంగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.500అందజేయనుంది. ఇందులో రూ.100నోట్ పుస్తకాలకు, రూ.250తోస్టేషనరీ, రూ.150 చార్టు పేపర్ల కోసం వినియోగించనున్నారు. దీనికి సంబంధించిన నిధులను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. గదుల్లో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను ఏర్పాటు చేసి వాటిని చూపిస్తూ చిన్నారులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఎంపికైన ప్రాథమిక పాఠశాలల

నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు, తిరుమలాయపాలెం, చింతకాని, సత్తుపల్లి మండలం చెరుకుపల్లి, పెనుబల్లి మండలం మండాలపాడు, ఏన్కూరు మండలం తూతకలింగన్నపేట, తల్లాడ మండలం ముద్దునూర హరిజనవాడ, రఘునాథపాలెం మండలం మంగ్యాతండ, ఖమ్మం అర్బన్ మండలం కూచవల్లిపాలెం, కామేపల్లి మండలం కొమ్మినేపల్లి, ఏన్కూరు మండలం హిమామ్‌నగర్, ఖమ్మం రూరల్ మండలం కస్నాతండ, ఖమ్మం నగరం గోపాలపురం, అల్లీపురం, కొణిజర్ల మండలం చిన్నమునగాల, తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు,పెనుబల్లి మండలం రామచంద్రారావు బంజర, కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి, ఖమ్మం రూరల్ మండలం జాన్‌పాడ్‌తండా, పాటివారిగూడెం, పడమటితండా, బోనకల్ మండలం రాపల్లి హరిజనవాడ, వెంకటరామునితండా, మల్లన్నపాలెం, రామన్నతండా ప్రాథమిక పాఠశాలలు ప్రీప్రైమరీకి ఎంపికయ్యాయి. వీటితోపాటు గతంలో ఎంపికైన మధిర మండలం సిరిపురం, సత్తుపల్లి ప్రాథమిక పాఠశాలలతో కలిపి మొత్తం 30 పాఠశాలయ్యాయి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక లేనట్టేనా?

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రీస్కూల్ విద్య అయిన నర్సరీ ఎల్‌కేజీ, యూకేజీ ని బోధించేందుకు జిల్లాలోని అంగన్‌వాడీ కేందాల్లో ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించి పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక పాఠశాలలు అని బోర్డులను ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాలను ముస్తాబు చేశారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి మరో టీచర్‌ను అదనంగా కేటాయిస్తామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రీ స్కూల్ విద్య అంటూ అధికారికంగా ప్రకటన చేయటంతో మరి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న పూర్వ ప్రాథమిక విద్య ఇకలేనట్టేనని తెలుస్తోంది.



జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

కారేపల్లిలో కలెక్టర్
విస్తృత పర్యటన

- జడ్పీ పాఠశాల, పీహెచ్‌సీ, సొసైటీల్లో ఆకస్మిక తనిఖీలు
- యూరియా కొరత లేకుండా చూడాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

7



మాట్లాడుతున్న రేగా కాంతారావు

కరకట్ట నిర్మాణ నిధులను పక్కదారి పట్టించారు

- స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి
- బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా

భద్రాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఒక్కపైసా కూడా నిధులివ్వలేదని, గత ప్రభుత్వంలో కేటాయించిన నిధులకు సంబంధించిన పనులే నడుస్తున్నాయని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. భద్రాచలంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేటాయించిన కరకట్ట నిర్మాణ పనుల నిధులు పక్కదారి పట్టాయని, ఇంకా కడుతూనే ఉన్నారని, రెడ్డి సత్రం రోడ్డు, కరకట్ట రిటైనింగ్ వాల్ కూలిపోగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకునే స్థితిలో లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మానె రామకృష్ణ, సునీల్‌కుమార్, పూర్ణచంద్రరావు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవస్థకు, ప్రజలకు వారధిగా..

రెయిన్‌బో రెవల్యూషన్

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో వాట్సాప్ చానల్ ఏర్పాటు
- ప్రజలతో సమాచారాన్ని పంచుకునేందుకు కొత్త విధానం

కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విభిన్న రంగాల్లో పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయడం, విప్లవాత్మక మార్పులు తేవడం, ప్రజలతో సమాచారాన్ని పంచుకోవడమే లక్ష్యంగా పాలన వ్యవస్థకు.. ప్రజలకు మధ్య వారధిగా ఉండేలా భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో భద్రాద్రి రెయిన్‌బో రెవల్యూషన్ వాట్సాప్ చానెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ చానల్ ద్వారా నేరుగా సమాచారాన్ని తెలియజేసేందుకు అవకాశం ఉంటుంది. వ్యవసాయం, ఉద్యానం, పట్టు పరిశ్రమలు, జీవ, జల వైవిధ్యం, పశుపాలన, పక్షుల పెంపకం,ఆగ్రోఫారెస్ట్రీ, బయోఇన్‌పుట్లు, సంప్రదాయ నిర్మాణ కళ, హస్తకళలు, మౌలిక సదుపాయాలు, ఆహారం, పర్యాటకం, ట్రెక్కింగ్, క్రీడలు, గ్రామీణ ఇంజనీరింగ్, నైపుణ్యాల్లో శిక్షణ తదితర రంగాలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని అందజేయనున్నారు. కాగా.. కృత్రిమ మేధస్సును ప్రాచీన మేధస్సుతో అనుసంధానం చేయడంతోపాటు ప్రజలతో సమాచారాన్ని పంచుకోవడం కోసం ఈ రెయిన్‌బో రెవల్యూషన్ చానల్ ఉపయోగపడుతుందని కలెక్టర్ పాటిల్ తెలిపారు.

నేడు స్కిల్ ఇండియా మిషన్ వారి సహాయంతో అవగాహన

గిరిజన యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణపై బుధవారం ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ అవగాహనకు స్కిల్ ఇండియా మిషన్ హైదరాబాద్ నుంచి రిసోర్స్ పర్సన్ వస్తున్నారని తెలిపారు. జిల్లాలో గిరిజన యువకుల కోసం శిక్షణను ఏర్పాటు చేశామన్నారు. కనీసం 10వ తరగతి విద్యార్హత, 30 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న వారు పాల్గొనాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



కార్పెంటర్ రంగంలో కొత్త స్కిల్స్‌పై హైదరాబాద్‌లో శిక్షణ

భద్రాద్రి జిల్లా పరిధిలోని గిరిజనులకు ఉపాధి అవకాశాలతోపాటు పనిలో కొత్త స్కిల్స్‌పై అవగాహన కలిగించడం కోసం హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌ఎస్‌టీఐ) ఆధ్వర్యంలో 10 మంది గిరిజన యువకులకు శిక్షణ ఇవ్వనున్నట్టు కలెక్టర్ తెలిపారు. పదో తరగతి పాసై.. 30ఏళ్లలోపు కలిగి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు నెలలపాటు సొంత ఖర్చులతో ఈ శిక్షణకు హాజరు కావాలని కోరారు. కాగా.. ప్రవేశ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5వేలను జిల్లా యంత్రాంగం భరిస్తోంది. అలాగే హాస్టల్, వసతి, భోజనం మూడు నెలలకు కలిపి రూ. 15వేలు ఖర్చు అవుతుంది. శిక్షణ పొందిన వారికి ఆరు నెలలపాటు హైదరాబాద్‌లో అప్రెంటీస్‌షిప్ అవకాశం ఉంటుంది. నెలకు రూ. 15వేలు జీతం లభిస్తుంది.



మొక్కలు నాటుతున్న సింగరేణి చైర్మన్ బలరాం

ప్రకృతి ప్రేమికుడు

- మొక్కలు నాటడంలో దిట్ట
- ఒకేరోజు 204 మొక్కలు నాటిన సింగరేణి సీఎండీ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రేమికుడిగా మొక్కలు నాటడంలో దిట్టగా పేరు పొందుతున్నారు సింగరేణి చైర్మన్ ఎన్.బలరాం. పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతూ.. వీలైనంత ఎక్కువగా మొక్కలునాటుతూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదే కోవలో సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని అధికారుల గృహ సముదాయంలో ఏకంగా 204మొక్కలను నాటారు. అదీ బలరాం ఒక్కరే కావడం గమనార్హం. ఇప్పటివరకు సింగరేణివ్యాప్తంగా ఆయన 19,804మొక్కలను నాటారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో సింగరేణి మైన్స్, డిపార్టుమెంట్లు, ఓపెన్‌కాస్టుల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా 15,231 హెక్టార్లలో 5.47కోట్ల మొక్కలను నాటడంతో పాటు సింగరేణి సమీప ప్రాంత గ్రామస్తులకు 2.29కోట్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని మొక్కలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సింగరేణి బంగ్లోస్‌లో పండ్ల మొక్కలు, ఔషధమొక్కలను నాటినట్లు తెలిపారు. పర్యావరణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములను చేయడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి లో మన పర్యావరణాన్ని మనమే కాపాడాలనే ఉద్దేశంతో..'ప్రతీ అడుగుపచ్చదనం' అన్న నినాదంతో ముందుకు సాగుతున్నట్టు బలరాం ప్రకటించారు. అడవులను పెంచే కార్యక్రమం లో సింగరేణి సంస్థ అగ్రభాగాన నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్‌వి.సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, జనరల్‌మేనేజర్లు సైదులు, రాధాకృష్ణ, రవికుమార్, శ్రీనివాసరావు, జీవి.కిరణ్‌కుమార్,చందా లక్ష్మీనారాయణ, దనసరి వెంకటేశ్వర్లు, ఏజీఎం మురళీధర్‌రావు పాల్గొన్నారు.

కల్లూరు డివిజన్‌కు ఐఏఎస్ హోదా

సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అజయ్ యాదవ్

కల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్లూరు రెవెన్యూ డివిజన్‌కు ఐఏఎస్ హోదా కల్పించింది. ఇక్కడ ఇక నుంచి సబ్ కలెక్టర్ హోదా గల అధికారి పరిపాలన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. 2016 అక్టోబర్, 11న కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటైంది. నాటి నుంచి నేటి వరకు ఆర్డీవో స్థాయి అధికారులు పరిపాలన బాధ్యతలు నిర్వహించారు. ఈ డివిజన్ పరిధిలో కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, తల్లాడ, వేంసూరుతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ఏన్కూరు మండలం విస్తరించి ఉంది. దీంతో ఈ డివిజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ హోదా గల అధికారి పరిపాలన సాగేలా ఆమోదం తెలుపుతూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజన్లు ఉండగా.. అందులో కల్లూరు డివిజన్‌కు మాత్రమే (ఐఏఎస్) సబ్ కలెక్టర్ హోదా అధికారిని కేటాయించటంతో ఇకపై ఈ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చినట్టయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా ఉపయోగకరమైన పనులు పారదర్శకంగా జరిగే అవకాశం ఉంది. పలు శాఖల పని తీరు గాడిన పడే ఆవకాశం ఉంది. భౌగోళికంగా, చారిత్రకంగా, వ్యవసాయ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కల్లూరు ప్రాంతం ఎంతో ప్రాచుర్యం కలిగి ఉంది. మూడు నెలల క్రితం కల్లూరు మునిసిపాలిటీగా అవతరించగా, అనతి కాలంలోనే కల్లూరుకు ఐఏఎస్ హోదా గల అధికారి సబ్‌కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించటం ఈ ప్రాంత పురోగతికి మరో ముందడుగా ప్రజలు భావిస్తున్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కల్లూరు మండల వాసి కావటం కూడా కల్లూరు పట్టణ అభివృద్ధితో పాటుగా, సబ్ కలెక్టర్ హోదా గల అధికారి నియామకంలో ఆయన కృషి ఉందని సమాచారం. .



కల్లూరు ఆర్డీవో కార్యాలయం



అజయ్ యాదవ్

సబ్ కలెక్టర్‌గా అజయ్ బాధ్యతల స్వీకరణ

కల్లూరు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్‌గా అజయ్ యాదవ్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్డీవోగా కొనసాగిన ఎల్ రాజేంద్రగౌడ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అజయ్ యాదవ్ కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన ఆయన సబ్ కలెక్టర్‌గా కల్లూరు డివిజన్‌కు బదిలీపై వచ్చారు. ఢిల్లీలో ఐఐటీ చదివిన అజయ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఇటావా జిల్లాకు చెందిన వారు. కల్లూరు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలనాపరంగా డివిజన్ స్థాయిలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందేలా అంకిత భావంతో సేవలందిస్తానని అన్నారు. నిబంధనలను పరిగణనలోకి తీసుకొని ప్రజలకు తన సేవలు అందిస్తానని తెలిపారు. అంతకుముందు కల్లూరుకు చేరుకున్న అజయ్ యాదవ్‌కు ఆర్డీవో రాజేంద్ర గౌడ్ పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యమైన గేదెల సేకరణ జరగాలి

- ఇందిరా మహిళా డెయిరీపై సమీక్షించిన ఖమ్మం కలెక్టర్ అనుదీప్



ఖమ్మం కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా డెయిరీలో భాగంగా లబ్ధిదారులకు అందించే గేదెల నాణ్యతలో ఎలాంటి రాజీ లేదని, కచ్చితంగా నాణ్యమైన జాతి, పాల దిగుబడి ఇచ్చే గేదెల సేకరణ జరగాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ గేదెల సేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరా డెయిరీ ఏర్పాటు, విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన గేదెల సేకరణకు ఇతర రాష్ట్రాల సంతలను అధికారులు సందర్శించి గేదెల లభ్యతను పరిశీలించి వచ్చినట్లు తెలిపారు. మొదటి విడతలో 250 గేదెలు సేకరించాలన్నారు. తుని, ఆలమూరు, తణుకు, ఉండి, కంకిపాడులో గేదెల సేకరణకుగాను బృందాలను పంపాలన్నారు. ఒక్కో బృందంలో 25మంది లబ్ధిదారులు, 4గురు అధికారులు ఉన్నట్లు ఆయన అన్నారు. ఈ సమీక్షలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ పురంధర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ.మధుసూదన్, వ్యవసాయ శాఖ ఏడీ విజయచందర్, ఎఫ్డీవోలు మంజుల, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మ్యూజియాన్ని సందర్శించిన

నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం

భద్రాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ ఆవరణలో ఉన్న గిరిజన మ్యూజియంను నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం సభ్యులు సోమవారం సందర్శించారు. రీసెర్చ్ అధికారి ఖాదర్‌బాషా, అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్ అబ్దుల్ బషీర్‌లు గిరిజన మ్యూజియంలో ఏర్పాటు చేసినగిరిజన సంప్రదాయ వస్తువులు, కళాఖండాలు, ఆభరణాలు, చిత్రాలను పరిశీలించడంతో పాటు పాతతరం గిరిజనులు వాడే పనిముట్లు, గిరిజన వంటకాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు అనంతరం గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్ల తయారీ కేంద్రాన్ని సందర్శించారు.కార్యక్రమంలో మ్యూజియం నిర్వాహకులు వీరస్వామి, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, అపర్ణ, మాధవి ఉన్నారు.



గిరిజన వంటకాలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ట్రైబల్ డీఎడ్ కళాశాల మెరిట్ జాబితా విడుదల

భద్రాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన ఉపాధ్యాయ డీఎడ్ కళాశాలలో చదివే విద్యార్థుల మెరిట్‌జాబితాను సోమవారం విడుదల చేశారు. డీఎడ్ కోర్సులో 50 సీట్లకుగాను 940 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వెరిఫికేషన్ కమిటీ రూపొందించిన మెరిట్ జాబితాను విడుదల చేశారు. ఇందులో ఎంపికైన వారు ఈ నెల 31న ఉదయం 10 గంటలకు డీఎడ్ కళాశాలలో మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ వైకేడీ భవాని కోరారు. వివరాలకు 9959575539, 8639084543లో సంప్రదించాలని కోరారు.

షటిల్ ఆడుతూ కుప్పకూలాడు

(5వ పేజీ తరువాయి)

ఓ స్టేడియంలో షటిల్ ఆడేందుకు వెళ్లాడు. స్నేహితులతో షటిల్ ఆడుతూనే గుండెపోటుతో కుప్పకూలాడు. స్నేహితులు అతడిని ఆస్పత్రికి తరలించాలని ప్రయత్నించినా.. అప్పటికే ప్రాణాలు కోల్పోవడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. రాకేష్ మరణ వార్త తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు తల్లాడ నుంచి హైదరాబాద్ వెళ్లారు. సోమవారం గాంధీ ఆస్పత్రిలో రాకేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం తల్లాడలో అంత్యక్రియలు జరిగాయి. మృతదేహాన్ని వందలాది మంది సందర్శించి నివాళులర్పించారు.

విద్యను కొనసాగించడానికే ఓపెన్ స్కూళ్లు

భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెంఎడ్యుకేషన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మధ్యలో చదువు మానివేసి తిరిగి విద్యను కొనసాగించడానికి ఓపెన్‌స్కూల్స్ దోహదపడతాయని భద్రాద్రి అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఐడీఓసీలో ఓపెన్‌స్కూల్స్ 2025-26 అడ్మిషన్ క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ డి. వేణుగోపాల్, అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) విద్యాచందన, ఖమ్మం ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ ఎం.పాపారావు ఆవిష్కరించారు. ఎలాంటి అపరాధరుసుం లేకుండా జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం ఓపెన్ స్కూల్స్ కో ఆర్డినేటర్ ఎం. పాపారావు, సెల్ నెం: 8008403522ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో జయలక్ష్మి, పరిశ్రమల అధికారి పృథ్వీ పాల్గొన్నారు.

పర్యాటక హబ్‌కు.. ప్రణాళికలు!

(5వ పేజీ తరువాయి)

పర్యాటక శాఖ మంత్రి మంత్ర జూపల్లి అభిప్రాయడ్డారు.

భద్రాద్రి క్షేత్రంలో మెరుగైన వసతులు కల్పించాలి..

దేశంలో ప్రసిద్ధిగాంచిన భద్రాద్రి క్షేత్రం, రామాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పర్యాటక అభివృద్ధికి అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేటు భాగస్వామ్యంతో కేటాయించనున్నట్టు వెల్లడించారు. జిల్లాలో పర్యాటక శాఖ అధికారులు, కలెక్టర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ సిద్ధంచేయాలని సూచించారు. ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తారని, ఆ సమయంలో పలు పర్యాటక ప్రదేశాలను కూడా సందర్శించే అవకాశం ఉందని, సీఎం వచ్చేలోపు పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖమ్మం పట్టణ సమీపంలో ఉన్న వెలుగుమట్ల అర్బన్ పార్కు అటవీ ప్రాంతంలో ఎకో టూరిజంకు సంబంధించిన పనులు కూడా పూర్తిచేయాలని కోరారు. కొత్తగూడెంలోని హరితహోటల్‌ను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా పర్యాటక రంగం అభివృద్ధిపై జరిగిన సమీక్షలో కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ భూ పోరాటం చిరస్మరణీయం

(5వ పేజీ తరువాయి)

అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని మాట్లాడుతూ ముదిగొండ భూపోరాటం చిరస్మరణీయమని, పోలీసు తూటాలకు ఎదురొడ్డి అమరులైన ఉసికల గోపయ్య, యలగందుల వీరన్న, కత్తుల లక్ష్మీ, బంకా గోపయ్య, పసుపులేటి కుటుంబరావు, జంగం బాలస్వామి, చిట్టూరి బాబూరావు అమరత్వంతో తడిసిన నేల ముదిగొండ గడ్డ అని పేర్కొన్నారు. వారి ఆశయాల సాధనకు కృషిచేయాలని, 2007లో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు ఇంటికోసం జానెడు జాగ ఇవ్వాలంటూ నిరవధిక దీక్ష చేస్తుంటే.. నాటికాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా లాఠీచార్జీ చేసి పోలీసు కాల్పులు జరిపి ఏడుగురు ప్రాణాలను పొట్టన బెట్టుకుందన్నారు. మండలంలో బలమైన పార్టీగా ఉన్న సీపీఎంను దెబ్బతీయాలని నాటికాంగ్రెస్ ప్రభుత్వం ఈ కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పక్షపాత ధోరణి అవలంబిస్తోందని, అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, కల్యాణం వెంకటేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా నాయకురాలు బండి పద్మ, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు మంకెన దామోదర్, మండల నాయకులు టీఎస్.కల్యాణ్, భద్రయ్య, నాగేశ్వరరావు, పద్మావతి, ప్రభావతి, బట్టు రాజు, మెట్టెల సతీష్, ఉపేందర్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలపైనే గురి

ఖమ్మం, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికలపై గురిపెట్టిన బీజేపీ.. ఉమ్మడి జిల్లాలో బలోపేతానికి కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన నారపరాజు రామచంద్రరావు మంగళవారం జిల్లా పర్యటనకు రానున్నారు. కొత్త అధ్యక్షుడి రాకతో ఉమ్మడి జిల్లాలో కమలాన్ని వికసింపజేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సరికొత్త ఉత్సాహం చూపుతున్నారు. త్వరలో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మునిసిపల్ ఎన్నికలు రాబోతుండడంతో.. ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలకు రామచంద్రరావు దిశా నిర్దేశం చేయనున్నారు. 'స్థానిక' ఎన్నికలపై దృష్టి సారించి నిర్వహిస్తున్న ఈ పర్యటనలో ఉమ్మడి జిల్లాలో.. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పొత్తులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే టీడీపీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో.. బీజేపీ కార్యకర్తలు, నాయకుల్లో ఎన్డీయే కూటమిగా బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయా!? అన్నదానిపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావు అధ్యక్ష

- నేడు జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు రాక
- ఘన స్వాగతానికి పార్టీ శ్రేణుల ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో కమలం వికసించేనా?

హోదాలో తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. దీంతో ఆయన రాకకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.30గంటలకు నాయకన్‌గూడెం వద్ద రామచంద్రరావుకు స్వాగతం పలకనున్నారు. 9 గంటలకు కూసుమంచి శివాలయంలో పూజల్లో పాల్గొని 10 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ఈ సందర్భంగా కాల్వొడ్డు నుంచి బైక్ ర్యాలీ ఏర్పాటు చేశారు. 11 గంటలకు సప్తపది ఫంక్షన్‌హాల్‌లో జనసభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సూర్యతేజ హోటల్‌లో ఖమ్మంలోని మేధావులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి మేధావుల సలహాలు, సూచనలు కూడా పంచుకోనున్నారు.

● లోక్‌సభ ఎన్నికల్లో బలం చూపిన బీజేపీ

అసెంబ్లీ ఎన్నికల్లో నామమాత్రంగా నిలిచిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిగా టీడీపీ, జనసేనతో కలిసి ప్రచారం నిర్వహించింది. ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు లక్షా 19వేలకు పైగా ఓట్లు రావడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మహబూబాబాద్ నుంచి పోటీ చేసిన సీతారాంనాయక్‌కు కూడా అదేస్థాయిలో ఓట్లు లభించాయి. ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో చెప్పుకోదగిన ఓటు బ్యాంకు లభించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలైన గ్రామ పంచాయతీ, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మునిసిపల్ కౌన్సిలర్ పదవుల కోసం ఎన్నికల బరిలోకి దిగాలని బీజేపీ సిద్ధమవుతోంది. స్థానిక ఎన్నికల్లో పట్టు సాధిస్తేనే సంస్థాగతంగా బలోపేతం అవుతామని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. ఈ క్రమంలోనే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ఉమ్మడి జిల్లాలో రామచంద్రరావు పర్యటన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

సవరించిన అంచనాలకు..ఆమోదం

(5వ పేజీ తరువాయి)

భూసేకరణ వేగవంతమై డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు వేగంగా జరగనున్నాయి. ఈఏడాది రాజీవ్‌లింక్‌కెనాల్ ద్వారా 1600క్యూసెక్కుల విడుదల చేయడం ద్వారా సాగర్ ఆయకట్టు కింద లక్షా21వేల ఎకరాలకు మరో 10వేల ఎకరాల చెరువులకు సాగునీరు అందించారు.

పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం : మంత్రి తుమ్మల

సీతారామప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓప్రకటనలో తెలిపారు. సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని డిజైన్లను సెంట్రల్ వాటర్ కమిషన్ సాంకేతిక కమిటీ ఆమోదించిందని, తద్వారా గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సాగు, తాగునీటికి మిషన్ భగీరథతో పాటు ఇతర పరిశ్రమలకు ఉపయోగించుకోవచ్చన్నారు. మిగులు పనులు కూడా వేగంగా పూర్తయి ఆయకట్టులోని ప్రతీ ఎకరానికి నీరందుతుందన్నారు. పెరిగిన అంచనాలకు ఆమోదించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

సింగభూపాలెం ప్రాజెక్టుకు శాశ్వత పరిష్కారమెప్పుడు?

సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

సుజాతనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సింగభూపాలెం ప్రాజెక్టుకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు అని సీపీఎం భద్రాద్రి జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సింగభూపాలెం ప్రాజెక్టును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సింగభూపాలెం ప్రాజెక్టు 1936లో 2,600 ఎకరాలకు సాగునీరు అందే విధంగా నాటి కాకతీయుల కాలంలో ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. వాగు ఉన్న చోట నిర్మాణం చేసి 1986లో అమరజీవి కాసాని ఐలయ్య నాయకత్వంలో కట్ట కుంగుబాటు గురైనచోట ప్రజల సహకారంతో సిమెంట్ కట్టలు వేసి అక్కడ పార్టీ ఆధ్వర్యంలోని చెరువు కట్ట కాపాడుకున్నారన్నారు.

ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలని లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటి సభ్యులు కున్సోత్ ధర్మ సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్ శ్రీనివాస్, శివరామకృష్ణ, శ్రీను, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, జ్యోతిరాం, శ్రీధర్‌రాజు, కన్నబోయిన గంగయ్య, బాబా, పాపారావు, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ బహిరంగ విచారణ

ఒక రోజులో రెండు డివిజన్ బెంచీలపై 100కుపైగా కేసులు స్వీకరణ

సుమారు 88కేసులు విచారణ.. సగానికసగంపైగా పోలీసుల పనితీరుమీదే ఫిర్యాదులు

విచారణకు హాజరైన రవిగుప్తా, మహేష్ భగవత్ తదితర ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు

హైదరాబాద్ సిటీ, జూలై28(ఆంధ్రజ్యోతి): "చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడు అనుమానాస్పద మృతి చెందితే, పోలీసులు రోడ్డుప్రమాదంగా కేసు నమోదు చేశారంటూ ఓ తల్లి ఫిర్యాదు. ఆస్తి తగాదాలలో సొంత చెల్లెళ్లే అన్నను పొట్టన పెట్టుకున్నారంటూ మృతుడి భార్య ఆవేదన. అర్ధాంతరంగా ఉద్యోగంలో నుంచి తనను తొలగించారని ఓ యువకుడి రోదన. ఇలా ఒకటా, రెండా... భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవ హక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం వేదికగా సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్ -1 లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ రామసుబ్రహ్మణ్యన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ -1లో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ -2లో మొత్తం 52కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలోనూ జైళ్లలోని పరిస్థితులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కొన్ని కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులమీద సాయంత్రం వరకు విచారణ కొనసాగింది. తెలంగాణ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి రవి గుప్త, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్‌తో పాటు పలువురు ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, జిల్లా పోలీసు అధికారులు పలు కేసుల నేపథ్యంలో విచారణకు హాజరయ్యారు.

ఖమ్మం పోలీసు కమిషనరేట్ చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు

మృతుడి తల్లి లక్కన లక్ష్మీకుమారి, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

తన కుమారుడిని స్నేహితులే హత్య చేశారంటూ 13నెలలుగా న్యాయపోరాటం చేస్తున్న ఓ తల్లి సోమవారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఖమ్మం పోలీసు కమిషనరేట్ చుట్టూ 8నెలలుగా తిరుగుతున్నా, అనుమానితులను విచారించడంకాదు కదా, కనీసం కేసుకూడా స్వీకరించలేదని ఆమె కన్నీరుపెట్టుకున్నారు. "మా అబ్బాయి భరత్‌సాయి 2024, జూన్‌లో చనిపోయాడు. బైక్ మీద వెళుతుండగా డివైడర్‌ను గుద్దాడని, ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించామని ఓ రోజు మాకు వాళ్ల ఫ్రెండ్ ఫోన్‌చేసి చెప్పాడు. అదే నిజమని నమ్మిన మేము, డాక్టర్ల సూచనతో విజయవాడకు తర్వాత గుంటూరు ఆస్పత్రికి తీసుకెళ్లాం. అయినా బాబు మాకు దక్కలేదు. శవపంచనామా కూడా సరిగా జరగలేదు. చేతికి అంది వచ్చిన 20ఏళ్ల కొడుకు కళ్లముందే పోయాడన్న బాధలో మాకు అప్పుడు అనుమానం కలగలేదు. తర్వాత మా అబ్బాయి సెల్‌ఫోన్‌లోని ఫొటోలు, ఢిల్లీ వ్యక్తులతో లావాదేవీలు లాంటి సాక్ష్యాల చూశాక... మా అబ్బాయిని వాడి స్నేహితులే చంపి రోడ్డు ప్రమాదంగా నమ్మించారని అర్థమైంది. అదే విషయం ఖమ్మం పోలీసు కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించు కోలేదు. ఒకటి, రెండు కాదు 8నెలలు కమిషనరేట్ చుట్టూ తిరిగినా మా గోడు విన్నవాళ్లు లేరు. అందుకే ఇక్కడికి వచ్చాం. మా కేసు మీద ప్రత్యేక విచారణ జరిపిస్తామని ఎన్‌హెచ్‌ఆర్‌సీ డివిజన్ బెంచ్-1లో జస్టిస్ రామసుబ్రహ్మణ్యన్ గారు హామీ ఇచ్చారు.

ఆలోచనలతో ఆవిష్కరించండి..

ప్రోత్సహిస్తే అద్భుతాలే..!

ఇన్‌స్పైర్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యూకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆలోచనకు సృజనాత్మకత జోడించి కొత్త ఆవిష్కరణలకు రూపకల్పన చేసేలా ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను నూతన ఆవిష్కరణల వైపు ఆసక్తి పెంచితే భవిష్యత్‌లో వారు బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనాక్ దోహదపడుతుంది. సామాజిక సమస్యలు, నూతన అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఆలోచనలు చేస్తే విద్యార్థులు జపాన్ వెళ్లడానికి అవకాశం కలుగుతుంది.

విద్యార్థులను నూతన ఆవిష్కరణ వైపు మళ్లించడానికి కేంద్ర మానవ వనరుల శాఖ ఇన్‌స్పైర్ మనాక్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతీ ఏడాది 6 - 10వ తరగతి విద్యార్థులు, ఇంటర్మీడియట్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలను సాధించేందుకు ఇన్‌స్పైర్ పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2025- 26 విద్యాసంవత్సరంలో నూతన ఆవిష్కరణల కోసం ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ ప్రకటన చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్, గిరిజన, రెసిడెన్షియల్, కేజీబీవీల నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

దరఖాస్తు ఎవరు చేసుకోవాలి..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6-10వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఆన్‌లైన్ ద్వారా నూతన ఆవిష్కరణలను అప్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపికైన ఆవిష్కరణలకు ఒక్కొక్కరికి రూ.10వేలు మంజూరు చేస్తారు. పాఠశాల నుంచి గరిష్ఠంగా ఐదు, ఇంటర్మీడియట్ నుంచి రెండు దరఖాస్తులు చేసుకోవాలి.

దరఖాస్తు విధానం..

www.inspireaward అనే వెబ్ సైట్ ద్వారా స్కూల్ కోడ్ ద్వారా లాగిన్ కావాలి. యూజర్ నేమ్, పాస్‌వర్డు కొడితే వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. ఈ వెబ్‌సైట్‌లో విద్యార్థి వివరాలు, బ్యాంకు వివరాలు, నూతన ఆవిష్కరణకు సంబంధించిన సంక్షిప్త ప్రాజెక్టు నివేదిక దానికి సంబంధించిన ఫొటోలు, విద్యార్థి, పాఠశాల వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10వేలు నేరుగా విద్యార్థి బ్యాంకు అకౌంట్‌లో జమ అవుతాయి.

ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలి

విద్యార్థుల నూతన ఆలోచనలకు పదును పెట్టే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. పాత ఆవిష్కరణలను దూరం పెట్టి, కొత్త ఆలోచనలతో ప్రాజెక్టులు రూపొందించాలి. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు గైడ్‌టీచర్‌గా ఉండే అవకాశం ఉంటుంది. పాఠశాలలో ఐడియా బాక్స్‌లు ఏర్పాటు చేసి, విద్యార్థుల ఆలోచనలను ఈ బాక్సుల్లో వేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు స్వయంగా ప్రాజెక్టులు రూపొందించుకునే విధంగా ప్రోత్సహించాలి.

ఉమ్మడి జిల్లా నుంచి 1,462మంది విద్యార్థులు...

2024- 25 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా నుంచి 1462మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భద్రాద్రి నుంచి 560 మంది దరఖాస్తు చేసుకోగా.. వీటిలో 115 మంది విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఖమ్మం జిల్లా నుంచి 902 విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే.. 100 ప్రాజెక్టులను ఎంపిక చేశారు.

రాష్ట్రంలో భద్రాద్రి జిల్లాకు ప్రత్యేకత

గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రత్యేకత ఉంది. సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్, ఎన్‌జీసీల నిర్వహణలో భద్రాద్రి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. జిల్లా కలెక్టర్, డీఈవో ప్రోత్సాహం, సహకారంతో సైన్స్ పోటీలు విజయవంతంగా నిర్వహించారు. గత ఏడాది భద్రాద్రి జిల్లా నుంచి ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనగా.. ఒక ప్రాజెక్టు మణుగూరు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

కొత్త ఆవిష్కరణలకే ప్రాధాన్యం

ఎం.వెంకటేశ్వరాచారి, డీఈవో భద్రాద్రి



ఇన్‌స్పైర్ మనాక్‌లో కొత్త ఆలోచనలు, నూతన ఆవిష్కరణలకే ఎక్కువ ప్రాధాన్యత.. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు కలిగించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఐడియా బాక్సుల ద్వారా విద్యార్థుల నుంచి ఆలోచనలు రాతపూర్వకంగా స్వీకరించి, నూతన ఆలోచనలను ప్రోత్సహించాలి.

12 గంటలు.. 111 పాటలు..

నిర్విరామంగా పాడిన పూజారి జ్యోతి

తెలంగాణ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు



రికార్డు పత్రాలను అందుకుంటున్న జ్యోతి

భద్రాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆదివారం స్వరాంజలి, 24 టీవీ మీడియా, జ్యోతి ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమంలో గాయని పూజారి జ్యోతి 12గంటల పాటు 111 పాటలను పాడి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించింది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్విరామంగా జ్యోతి ప్రముఖ గాయని చిత్ర పాడిన పాటలను ఆలపించి ఈ రికార్డును కైవసం చేసుకుంది. జ్యోతికి బుక్ ఆఫ్ రికార్డు ప్రతులను ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, అర్చకులు కృష్ణచైతన్య, కర్రి నాగేశ్వరరావు, శంకర్‌రావు, డాక్టర్ విజయరావులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమలా రాజశేఖర్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, అజీమ్, రాజా శ్రీనివాస్, కురిచేటి జనార్దన్ కార్యక్రమ ఆర్గనైజర్లు పోకల శ్రీనివాస్, అనుమాండ్ల నాగరాజు, పద్మావతిలు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

భద్రాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి గత మూడు రోజులుగా 30 అడుగులకు పైనే కొనసాగుతూ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుతూ తగ్గుతోంది. ఈ నెల 25న రాత్రి 9 గంటలకు 26.40 అడుగులున్న గోదావరి 26న ఉదయం 6 గంటలకు 31.30 నుంచి రాత్రి 9 గంటల వరకు 35.40 అడుగకుల చేరుకుంది. శనివారం అర్ధరాత్రి నుంచి స్వల్పంగా తగ్గి ఆదివారం రాత్రి 9 గంటల వరకు 34.30 అడుగులకు చేరుకుంది. మళ్లీ సోమవారం ఉదయం 8 గంటలకు 34.50 నుంచి స్వల్పంగా పెరుగతూ రాత్రి 7 గంటల వరకు 36.30 అడుగకుల చేరుకుంది.

గడువు ముగిసిన వాహనాలకు

గ్రీన్ టాక్స్ చెల్లించాలి

రవాణా శాఖ భద్రాద్రి జిల్లా అధికారి వెంకటరమణ



చుంచుపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గడువు ముగిసిన వాహనాలకు గ్రీన్‌టాక్స్ చెల్లించాలని, ఆన్‌లైన్‌లో చెల్లించిన అనంతరమే ఆ వాహనాలకు రెన్యువల్ చేయడం జరుగుతుందని భద్రాద్రి జిల్లా రవాణా శాఖ అధికారి సోమవారం తెలిపారు. జిల్లాలో 15 సంవత్సరాల కాలపరిమితి పూర్తి అయినా, గడువు ముగిసిన వాహనాలకు గ్రీన్‌టాక్స్ చెల్లించకుండా రోడ్లపై తిరిగితే తనిఖీల సమయంలో అదుపులోకి తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమయంలో వాహన యజమానులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా మూడు నెలలకు ఒకసారి ట్యాక్స్ చెల్లించే ఎల్లో ప్లేట్ (టాక్సీ) వాహనాలకు ట్యాక్స్ చెల్లించని యెడల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆ వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల సమయంలో వాహన యజమానులు వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఫిట్‌నెస్, టాక్స్ చెల్లించిన ధ్రువపత్రాలు, ఇన్సూరెన్స్, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తమతో ఉంచుకోవాలని, తనిఖీల్లో అధికారులకు సహకరించాలని సూచించారు. ఇటీవల జిల్లాలోని 144 పాఠశాలల, కళాశాలల బస్సులు ఫిట్‌నెస్ చేశామని గుర్తు చేశారు. అదేవిధంగా ప్యాసింజర్ ఆటోలో విద్యార్థులను పాఠశాలకు, కళాశాలకు తీసుకువెళ్ళి రాకపోకలు చేసే ఆటోలు నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. మితిమీరి విద్యార్థులను ఎక్కించుకొని రాకపోకలు చేయడం చట్ట ప్రకారం నేరమన్నారు. వర్షాకాలంలో ఆటో యజమానులు అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై ట్రాఫిక్‌ను గమనించుకొని విద్యార్థులను తీసుకువెళ్ళాలని సూచించారు.

కారేపల్లిలో కలెక్టర్ విస్తృత పర్యటన

జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సొసైటీల్లో ఆకస్మిక తనిఖీలు

యూరియా కొరత లేకుండా చూడాలి

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్



సొసైటీలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

కారేపల్లి జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. శుభ్రత పాటించాలన్నారు. తరగతి గదులలో కలయతిరుగుతూ విద్యార్థులతో మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థుల నైపుణ్యతను తెలుసుకునుటకు పాఠాలు చదివించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మంచి చదువుతోనే విద్యార్థులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని, అందుకోసం విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య వందశాతం ఉండేలా ఉపాధ్యాయులు పాటుపడాలని సూచించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అక్కడ నుంచి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడి రోగులతో మాట్లాడుతూ వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అయితే వైద్యశాలలో సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే ఖాళీలను పూర్తిచేస్తామని తెలిపారు. నిరంతరం వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలుకు సేవ చేయాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. అలాగే ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. హాజరుకాని సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపట్ల మూడు నెలలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓపీ, ఐపీ రికార్డులు, ల్యాబ్ రికార్డులను ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు.

యూరియా నిల్వలను పరిశీలించిన కలెక్టర్

మండల కేంద్రంలో సహకార సొసైటీలో యూరియా నిల్వలను తనిఖీ చేశారు. యూరియా నిల్వల గురించి సీఈవో హనుమంతరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులకు సంబంధించిన ఫిర్యాదులపై టోల్‌ఫ్రీ నెంబరు 1077లకు కాల్ చేయాలన్నారు. యూరియా అక్రమరవాణా జరగకుండా అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైనా బందోబస్తు చేపట్టిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, ఎంఈవో జయరాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి'కి

దరఖాస్తుల ఆహ్వానం

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ అధికారి అనసూర్య



చుంచుపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం-2025లో భాగంగా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థినీ, విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడానికి అర్హులైన ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారిణి అనసూర్య సోమవారం తెలిపారు. ఈ పథకంలో భాగంగా రూ.20 లక్షలు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులకు అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా పది దేశాలు వెళ్లేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించి వచ్చేనెల ఆగష్టు 31వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తులను భద్రాద్రి ఐడీవోసీలోని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయం, ఎస్-27లో అందజేయాలని తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



రవికాంత్ (ఫైల్)

టేకులపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): టేకులపల్లి మండల కేంద్రంలోని పాతసినిమా హాలు బజారులో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండల కేంద్రానికి చెందిన యనగంటి రవికాంత్(36) ఆర్ఎంపీ వైద్యునిగా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తన స్నేహితుని ఫోన్ కాల్ మేరకు బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి తన గదిలో నిద్రించాడు. ఆదివారం రాత్రి సుమారు 7.30గంటల సమయంలో గురుకపెడుతూ నోటినుంచి నురుగులు వస్తుండటాన్ని రవికాంత్ భార్య గమనించి అత్తమామలకు తెలిపింది. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మరణించాడు. తన కుమారుడు రవికాంత్ మృతిపై అనుమానం ఉన్నదని తండ్రి అర్జునరావు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

గుండెపోటుతో రైతు...



కోటయ్య(ఫైల్)

నేలకొండపల్లి, జూలై28(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని పైనంపల్లిలో జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుక్కల కోటయ్య(65) సోమవారం ఉదయం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చాక ఛాతీలో నొప్పిగా ఉందంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని నేలకొండపల్లి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇరువురు కుమార్తెలున్నారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

జూలూరుపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం మండలంలోని జడలచింత గ్రామంలో చోటుచేసుకుంది. జడలచింత గ్రామానికి చెందిన పానుగంటి లక్ష్మయ్యతో పాటు అదే గ్రామానికి చెందిన గణేష్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా దాడి చేసింది. కొత్తూరు పెద్దహరిజనవాడ గ్రామానికి చెందిన గార్లపాటి యశోదను కరవడంతో కాలుకి తీవ్ర గాయాలయ్యాయి.

భద్రాద్రిలో వరుస వాహన చోరీలు



కారు టైర్లను దొంగిలించిన దృశ్యం

భద్రాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో గత కొన్ని రోజులుగా పలు ప్రాంతాల్లో వరుసగా పలు వాహనాల చోరీ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఏదో ఒక ప్రాంతంలో తెల్లారేసరికి వాహనం చోరీకి గురైందంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతుండటం, పోలీసులకు ఫిర్యాదు చేస్తుండటం కొనసాగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇళ్ల ముందు నిలిపి ఉంచిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని అర్ధరాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే పార్కింగ్ ప్రదేశాల్లో సైతం వాహన చోరీ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించారు. అలాగే అశోకనగర్ కాలనీలో ద్విచక్ర వాహనం చోరీకి గరైంది. అలాగే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద నిలిపి ఉంచిన కారుకి ఉన్న మూడు టైర్లు, డిస్కుతో సహా దొంగలు అపహరించారు. భద్రాచలం పక్కనే ఉన్న సారపాక గ్రామంలో సైతం వరుస వాహన చోరీలు జరుగుతుండగా సోమవారం మధ్యాహ్నం సమయంలో భాస్కర్‌నగర్‌లో ఓ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

ద్విచక్ర వాహన చోరీకి యత్నం

● పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

బూర్గంపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సోమవారం రాజీవ్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక గ్రామపంచాయతీలోగల రాజీవ్‌నగర్‌లో సోమవారం ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని ఓ వ్యక్తి తీసుకెళ్తుండగా గమనించిన స్థానికులు పట్టుకుని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు సమాచారం అందించి అతడిని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి సారపాకకు చెందిన రంజిత్ అనే వ్యక్తిగా గుర్తించామని వారు తెలిపారు.

వైద్యారోగ్యశాఖలో

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

ఖమ్మంక్రైం, జూలై28 (ఆంధ్రజ్యోతి): తాను ప్రభుత్వ డాక్టర్‌గా పనిచేస్తున్నానని వైద్యారోగ్యశాఖలో పలువిభాగాల్లో ఉదోగాలు ఇప్పిస్తానంటూ ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యక్తి మోసం చేశాడు. ఈఘటనపై పలువురు బాధితులు ఖమ్మంటుటౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు.. బాధితులు తెలిపిన కథనం ప్రకారం.. నగరంలోని కవిరాజనగర్‌కు చెందిన అనిల్ అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం తన పేరు కేతన్ అని, తాను ప్రభుత్వ వైద్యుడిగా పనిచేస్తున్నానని, ఖమ్మంజిల్లాతోపాటు ములుగుజిల్లా వాజేడు ప్రాంతానికి చెందిన కొంతమందికి పరిచయమయ్యాడు. వాజేడు ప్రాంతానికి చెందిన ఓ మహిళకు విద్యుత్‌శాఖలో అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పించి అందరిని నమ్మించాడు. ఆమహిళ ద్వారా మిగతవారిని పరిచయం చేసుకుని వైద్యారోగ్యశాఖలో స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎం ఉద్యోగాలున్నాయని, ఒక్కో ఉద్యోగానికి రూ.4నుంచి 5లక్షలు ఖర్చవుతుందని చెప్పి పలువురినుంచి డబ్బులు వసూలు చేశాడు. ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం రాకుండా తప్పించకుని తిరుగుతుండడంతో బాధితులు ఖమ్మంలోని అతని ఇంటి వద్దకు వచ్చి అడిగారు. దీంతో కుటుంబసభ్యులు తమకు సంబంధం లేదని చెప్పడంతో బాధితులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. మోసపోయిన వారిలో ఎక్కువమంది గిరిజనులే ఉన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు టుటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

ఆడపిల్లల దత్తతపై పోలీసుల విచారణ

వైరా, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని ఒక గ్రామంలో మూడేళ్ల వ్యవధిలో ఇద్దరు కుమార్తెలను దత్తత ఇచ్చిన వ్యవహారంపై పోలీసులు విచారణ నిర్వహించారు. కూలీపనులు చేసుకొని జీవిస్తున్న దంపతులు అధిక సంతానంతో తమకు పుట్టిన ఇద్దరు ఆడపిల్లలను దత్తత ఇవ్వడంపై స్త్రీశిశుసంక్షేమ శాఖ అధికారులకు అందిన ఆకాశరామన్న ఉత్తరంతో ఆశాఖ అధికారులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దాంతో వైరా ఎస్ఐ పి.రామారావు విచారణ నిర్వహించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మూగ యువకుడు తొమ్మిదేళ్ల కిందట సత్తుపల్లి మండలంలోని ఒక యువతిని వివాహం చేసుకున్నాడు. ఆభార్యభర్తలిద్దరూ కూలీపనులు చేసుకొని జీవిస్తున్నారు. వారికి మొత్తం ఐదుగురు సంతానం. మొదటి, రెండో కాన్పులో అమ్మాయిలు జన్మించారు. మూడో కాన్పులో అబ్బాయి జన్మించినప్పటికీ ఆవెంటనే అనారోగ్యంతో మృతిచెందాడు. ఆతర్వాత 2023లో జన్మించిన కుమార్తెను మూడునెలల వయస్సులో నాగార్జున్‌సాగర్‌కు చెందిన ఒకరికి, 2024 డిసెంబరులో జన్మించిన కుమార్తెను తొమ్మిదిరోజుల వయస్సులో మధ్యవర్తుల ద్వారా గుంటూరులోని దంపతులకు దత్తత ఇచ్చారు. కుమారుడు కావాలనే కోరికతో పేదరికం ఉన్నప్పటికీ ఆదంపతులు సంతానాన్ని కంటున్నారు. మొదటి కుమార్తె మూడో తరగతి, రెండో కుమార్తె ఒకటోతరగతి స్థానిక ప్రాథమిక పాఠశాలలోనే చదువుతున్నారు. అయితే ఈ ఇద్దరు ఆడపిల్లలను విక్రయించారని పేర్కొంటూ ఆగ్రామం నుంచి అడ్రస్ లేకుండా ఎంపీడీవో, మండల వైద్యాధికారికి, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులకు ఆకాశరామన్న లేఖలు వెళ్లాయి. విక్రయించిన ఆధారాలు ఎక్కడా లభించలేదు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత ప్రక్రియ జరగలేదని విచారణలో తేలింది

గిరిజన ఆశ్రమ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- పరీక్ష రాస్తూ అపస్మారక స్థితికి.. ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతిచెందినట్టు వైద్యుల నిర్ధారణ
- ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంలో ఘటన
- ప్రభుత్వాస్పత్రి ఎదుట తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ధర్నా



భూక్యా ప్రతిమ (ఫైల్)

ఖమ్మం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం బోడియాతండా పంచాయతీ పరిధిలోని నామాతండాకు చెందిన భూక్యా రమేష్, భూబమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఇంటర్ చదువుతుండగా, కుమార్తె ప్రతిమ (15) ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామం పరిధిలో ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం పాఠశాలలో ఎఫ్ఏ-1 సోషల్ పరీక్ష రాస్తూ కళ్లు తిరిగి కిందపడిపోయింది. ఇది గమనించిన ఉపాధ్యాయులు వెంటనే ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే ప్రతిమ మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. తమ కుమార్తెకు గతం లో ఎలాంటి అనారోగ్యం, మూర్ఛ లాంటివి లేవని, కానీ పాఠశాల వారు మూర్ఛ వచ్చిందని చెబుతున్నారని, ఆమె మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. వారికి మద్దతు పలుకుతూ విద్యార్థి సంఘాల నాయకులు కూడా ధర్నాలో పాల్గొన్నారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పలువు రు విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ఆరెస్టు చేశారు.

మృతదేహాన్ని సందర్శించిన జేసీ, ఆర్డీవో

విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీడీ విజయలక్ష్మి వెంటనే ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ప్రతిమ మృతదేహాన్ని సందర్శించారు. పాఠశాల సిబ్బందితో మాట్లాడి ప్రతిమ మృతి వివరాలను తెలుసుకున్నారు. అలాగే వారు ప్రతిమ కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడారు. అదనపు కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీవో నరసింహరావు, రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ ఉన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిమ మృతి సంఘటనపై పాఠశాలలో విచారణ జరిపేందుకు ఓ కమిటీని నియమిస్తామని, నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు



పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాకేష్



ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై28(ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తేలే రాకేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన పీవైఎల్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎన్నికను ప్రకటించారు. 2014నుంచి పీవైఎల్‌లో కీలకంగా పనిచేస్తున్నారు. 2016లో ఖమ్మం నగర కోశాధికారిగా 2021లో జిల్లాకార్యదర్శిగా 2022లో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 2023లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జక్కుల భరత్, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ప్రేమ్‌సింగ్ ఎన్నికయ్యారు.

కదలివచ్చి... ఫిర్యాదులు ఇచ్చి

'ప్రజావాణి'లో అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు

ఖమ్మంకలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తమ తమ సమస్యలను జిల్లా అధికారులకు ఏకరువుపెట్టేందుకు వరుసల్లో నిల్చొని మరీ అర్జీలను సమర్పించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజలు సమర్పించిన అర్జీలను అదనపు కలెక్టర్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మశ్రీ,



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సానుభూతిపరుడి హఠాన్మరణం

ఖమ్మంరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతిపరుడు గొడ్డుగొర్ల వెంకటబుచ్చి(50) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, జిల్లా నాయకులు నంద్రా ప్రసాద్, పి.సంగయ్య, పి.మోహన్‌రావు, నందిగామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్, ఈఎస్ఐ సేవలను వినియోగించుకోండి

ఖమ్మం, జూలై28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఈపీఎఫ్, ఈఎస్‌ఐల సేవలను వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు కోరారు. నిధి ఆప్‌కే నికెట్ 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మంలోని 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సేవలకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఎస్‌ఐ పథకం ద్వారా పదుల కొద్దీ ప్రయోజనాలు ఉన్నాయనీ అర్హులైన ఉద్యోగులందరూ ఆయా సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈఎస్‌ఐ ద్వారా కలిగే ప్రయోజనాలు, చందా షరతులను వివరించారు. బైపాస్‌రోడ్డు పెద్ద కూరగాయల మార్కెట్‌కు సమీపంలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఉందనీ, అనారోగ్య సమయంలో అక్కడ ఉన్న వైద్యులను సంప్రదించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్రాంచి మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, ఈపీఎఫ్ డీఎస్‌వో బాదావత్ నాగులు, ఈఎస్‌ఐ బ్రాంచి మేనేజర్ జి.సాయికుమార్, ఇన్‌చార్జి రెహానా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగులు

నగరంలో డెంగీ బెల్స్..

టీఎన్జీవోస్ కాలనీలో తొలి కేసు

గతేడాది 69 కేసులు నమోదు

సీజనల్ వ్యాధులకు ముప్పుగా మారిన ఖాళీ స్థలాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఖమ్మంకార్పొరేషన్, జూలై28(ఆంధ్రజ్యోతి): నగరంలో డెంగీ బెల్స్ మోగాయి. ఆదివారం ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ కాలనీలో డెంగీ కేసు నమోదు కావటంతో.. ఖమ్మం నగర పాలక సంస్థ, అర్బన్ మలేరియా విభాగంఅధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వైద్యశాఖ ప్రత్యేక అధికారి వరికూటి సుబ్బారావు టీఎన్జీవోస్ కాలనీలోని డెంగీబాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక వైద్యశిబిరాలు, రక్త పూతల సేకరణ వంటి వైద్యకార్యక్రమాలను ఏర్పాటు చేశారు.





బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సుబ్బారావు, జయనగర్ కాలనీలోని ఖాళీ స్థలంలో మురుగు

జనాభా ఎక్కువ.. సిబ్బంది తక్కువ

నగరంలో 1985లో అర్బన్ మలేరియా విభాగం ఏర్పాటు చేశారు. అప్పుడు జనాభా కేవలం 2లక్షలు ఉండగా మలేరియా సిబ్బంది మాత్రం 66మంది ఉన్నారు. ఇప్పుడు 6లక్షల జనాభా ఉండగా కేవలం 14మంది మలేరియా సిబ్బంది ఉన్నారు. దీంతో ఖమ్మం నగరంలోని 60 డివిజన్లుండగా వాటిలో 2, 4, 9, 10,18, 91,24, 27, 40, 42, 44, 47, 48 డివిజన్లు ఖమ్మం అర్బన్ మలేరియ విభాగం అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. మిగిలిన డివిజన్లలో కేఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారు. ఏటా అర్బన్ మలేరియాకు కేటాయించిన డివిజన్లు కాకుండా, కేఎంసీ పారిశుధ్య పర్యవేక్షణలో ఉన్న డివిజన్లలో డెంగీ, చికెన్‌గున్యా కేసులు అధికంగా నమోదు జరుగుతున్నాయి. మంచినీరు నిల్వలు తొలగించక పోవటం, వర్షాకాలం సీజనల్ వ్యాధుల సమయంలో కిమోపాస్, పైరెథ్రాన్ వంటి ఇతర లార్వా దోమల నివారణ ద్రావణాలు పిచికారి చేయకపోవటమే కారణంగా తెలుస్తోంది.

సీజనల్ ముప్పుగా ఖాళీ స్థలాలు

ఖమ్మం నగరంలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల ముప్పుగా ఖాళీ స్థలాలు మారాయి. ప్రతీ డివిజన్‌లోను వందల సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. వారంలో రెండు రోజులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించినా అవి అమలు కాలేదు. ఇటీవల వర్షాలకు ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరింది. పిచ్చి మొక్కలతో దోమలు, లార్వా పెరిగిపోయింది. విష సర్పాలు, కీటకాల కాటుకు నగర ప్రజలు గురైతున్నారు. డివిజన్లలో ఖాళీ స్థలాలపై స్థానికంగా ప్రజలు ఫిర్యాదులు చేసినా జవాన్లు, శానిటేరి ఇన్‌స్పెక్టర్లు స్పందించటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి.

అమలు కాని జోనల్ పర్యవేక్షణ

ఖమ్మం నగరంలో ప్రజలకు మరింతగా అభివృద్ధి, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య గ్రేటర్ హైదరాబాద్ తరహాలో ఐదు కార్యాలయాలతో జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

సంవత్సరం	డెంగీ కేసులు
2020	7
2021	207
2022	147
2023	129
2024	69

అయితే రాజకీయ కారణాలు, కార్పొరేటర్లు సహకరించక పోవటంతో రెండుజోనల్ కార్యాలయాలు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. డివిజన్లు మాత్రం విభజన చేశారు. సీజనల్ వ్యాధుల సమయంలోనైనా ప్రతీ జోనల్ కార్యాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియామకం జరిగితే పారిశుధ్య పర్యవేక్షణతో పాటుగా సీజనల్ వ్యాధులు, అభివృద్ధి పనుల పర్యవేక్షణకు విపత్తుల కాలంలో సరైనసేవలకు అవకాశం ఉంటుంది. కానీ ఏడు నెలలుగా జోనల్ కార్యాలయాలకు ప్రత్యేక అధికారుల నియామకం కాలేదు.

ప్రత్యేక అధికారుల నియామకంతోనే

ఖమ్మం నగర పాలక సంస్థకు ఇతర ప్రాంతాల నుంచి ఇటీవల బదిలీపై వచ్చిన అధికారులు పారిశుధ్య నివారణ చర్యలపై పట్టు సాధించ లేదని విమర్శలు వెలువడుతున్నాయి. పారిశుధ్య విభాగంలోను మూడు గ్రూపులుగా ఏర్పాడటంతో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు నుంచి 60వ ర్యాంకు ఖమ్మం నగరం దిగజారింది. ఫలితాల తర్వాత కూడా అధికారుల తీరు మారలేదు. కనీసం రివ్యూ చేసిన అధికారులే లేరు. డివాటరింగ్‌తో మంచినీటి నిల్వలు తొలగించే కార్యక్రమాలు జరగటం లేదు. దొమల లార్వను గుర్తించి సంహరించే స్పెషల్ డ్రైవ్‌లు కనిపించటం లేదు.

13 ప్రాంతాల్లో హాట్‌స్పాట్‌లు

ఖమ్మం నగరంలో గతేడాది 69 డెంగీ కేసులు నమోదు జరిగాయి. 13డివిజన్లలో డెంగీ బాధితులు అధికారికంగా నమోదు జరిగాయి. అనాధికారికంగా మరో వంద మందికి పైగానే వైద్యసేవలు తీసుకున్నారు. వైఎస్‌ఆర్ కాలనీ, పిచ్చయ్య సెంటర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఫుట్టకొట, కాల్వోడ్డు, శ్రీరామన్‌నగర్, రామకృష్ణనగర్, ప్రకాష్‌నగర్, బీకే బజార్, రజ దర్వాజ, నయబాజర్, నిమ్మలగడ్డ, గణేష్ నగర్, దాన్వాయిగూడెం, వికలాంగుల కాలనీ, దోరన్నకాలనీ, రామన్నపేటలో డెంగ్యూ కేసులు నమోదు కావటంతో హాట్‌స్పాట్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా కేంద్రలో గతేడాది విస్తతంగా వైద్యసేవలు, డ్రై డే, ఫ్రైడే, మంచినీరు నిల్వలు తొలగింపు, ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాలతో కొంత మేర కంట్రోల్ చేశారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

» ఏఓ రాధ, ఎస్ఐ సంతోష్

నేలకొండపల్లి, జూలై28(ఆంధ్రజ్యోతి): ఎరువులు కృత్రిమ కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి యం.రాధ, నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని పలుఎరువుల దుకాణాలు,సహకార సంఘాల గోడౌన్లను ఎంఏఓ, ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిష్టర్లు, గోడౌన్లలో నిల్వలను తనిఖీ చేశారు. నిల్వలు, రికార్డులు సరిగా ఉన్నదీ?లేనిదీ?పరిశీలించారు. అనంతరం ఏఓ రాధ, ఎస్ఐ సంతోష్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు స్టాకు బోర్డులను షాపుల ఎదుట ఉంచాలన్నారు. నిల్వలతో పాటుగా ధరలను బోర్డుపై డిస్‌ప్లే చేయాలన్నారు. స్టాకు బోర్డును నిత్యం అప్డేట్ చేయాలన్నారు. స్టాకు రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులివ్వాలన్నారు. ఏఈఓ అరవింద్, కానిస్టేబుల్ భూక్యా హరి ఉన్నారు.



ఎరువు దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

తిరుమలాయపాలెం: రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులు కొరత లేకుండా చూడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జి.రమేష్, ఉప్పలయ్య, వీరస్వామి, నాగయ్య వెంకటేశ్వర్లు, పెంటయ్య, రమేష్ పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

ఖమ్మంరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, వెంకటగిరి పరిధిలోని కోటనారాయణపురంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కోటనారాయణపురానికి చెందిన పీకల.సతీష్ తన స్నేహితుడితో కలిసి ఖమ్మం నుంచి కోటనారాయణపురంలోని తన ఇంటికి వెళుతున్నారు. మార్గంమధ్యలోని వెంకటరమణ ఇంటి వద్ద ఆగారు. వెంకటరమణ ఇంటి బయట ఉండటంతో అతడితో ఉదయం జరిగిన క్రికెట్ మ్యాచ్ గురించి మాట్లాడారు. దానివిషయంలో వారి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని వెంకటరమణ ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకువచ్చి సతీష్ పొట్టపై పొడిచాడు.తీవ్రగాయం కావటంతో స్థానికులు ఖమ్మం తరలించారు. బాధితుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం,జూలై28(ఆంధ్రజ్యోతి): వేరు వేరు ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. చెరువు బజార్‌కు చెందని దుగ్గిరాల సూర్యనారాయణ, గెంటెల నరేష్, ఆంజనేయశర్మ, దొనకొండ జాను ఇటీవలే ఒడిషాకు వెళ్లి గంజాయి కొనుగోలు చేశారు. నగరంలోని సీక్వెల్ రిసార్ట్స్ ప్రాంతంలో గురవయ్య, చల్లా గోపి, దిలీప్‌కుమార్‌లకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు వారిని పట్టుకుని వారివద్ద నుంచి 1.5 కేజీల గంజాయి, ఆటో, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాసనగర్‌కు చెందిన సాయిరామ్, సాదిక్‌పాషా వైఎస్‌ఆర్ నగర్‌కు చెందిన రాము వద్ద 100 గ్రాముల గంజాయి కొనుగోలుచేసి సారథీనగర్‌బ్రిడ్జి సమీపంలో తాగుతున్నారు. త్రీటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేశారు.

'విజయ'లో ముగిసిన ఏఐ శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కొణిజర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విజయ ఇంజనీరింగ్ కళాశాల, స్మైస్పార్క్ అకాడమీతో ఒప్పదం మేరకు నెలరోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ముగిసింది. సోమవారం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఏఐ మరియు జెన్ఏఐ కోర్సు మీద శిక్షణ ఇచ్చారు. ఏడురకాల రియల్ టైం ప్రాజెక్ట్స్ జెన్ఏఐ టూల్స్‌ఉపయోగించుకొని అభివృద్ధి చేశామని కళాశాల సీఈవో శ్రీ కవిత ఎర్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి హర్షసింగ్, సీటీవో, స్పీడ్‌లాబ్స్ మరియు ఫాతిమా, ప్రాజెక్ట్‌కి జడ్జిగా వ్యవహరించారు. కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నిజ జీవితంలో విద్యార్థులకు మరియు సామాన్య ప్రజలకు ఉపయోగపడే యాప్స్ చేయటం చాలా అభినందనీయమని, స్మైస్పార్క్ అకాడమీ సీఈవో శ్రీకవిత శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ చైర్ పర్సన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ అయేషా తరుణం, డీన్.డాక్టర్ శ్రీనివాస్, ఏవో డాక్టర్ పరీద్‌బాబా, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వైద్యవిద్య కష్టతరం

తుమ్మల యుగంధర్

ఉత్సాహంగా డాక్టర్ మెడికల్ అకాడమీ మీట్

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ మెడికల్ అకాడమీ సక్సస్ మీట్ సోమవారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఉత్సహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ నాయకుడు తుమ్మల. యుగంధర్ హాజరయ్యారు. వైద్యవిద్య అనేది కష్టతరమని డాక్టర్ మెడికల్ అకాడమీలో చదివే విద్యార్థులు అత్యధికంగా మెడికల్ సీట్లు సాధించటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా అకాడమీ డైరక్టర్లు రాయల. సతీష్ బాబు, ఈగా. భరణీకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పలువురు విద్యార్థులకు మెమెంటోలు, స్టెటస్‌స్కోప్, ఆప్రాన్లు అందించారు. 626 అత్యధిక మార్కులు సాధించిన తూము. వెన్నెలను ప్రత్యేకంగా అభినందించారు. విద్యారంగంలో 26 సంవత్సరాల అనుభవంతో రామల. సతీష్‌బాబు, 28 సంవత్సరాలుగా ఈగా. భరణీకుమార్ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న యుగంధర్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటరు విజయ, వెంకటరమణ

ఖమ్మంకార్పొరేషన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో 51, 52, 58 డివిజన్లలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా సోమవారం పర్యటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి, కల్యాణ లక్ష్మీ, షాదుముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు 46వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి, కాంగ్రెస్ నాయకులు ప్రసన్నకృష్ణ కలిసి రూ.2.14 లక్షల చెక్కులను ఐదుగురికి పంపిణీ చేశారు. 44వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయ సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి అందించారు.

ద్విచక్రవాహనంలో మంటలు

నేలకొండపల్లి, జూలై28(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లికి చెందిన పగిళ్ళ బాలరాజు మందులు కొనుగోలు చేయటానికి మెడికల్స్ ముందు తన ద్విచక్ర వాహనాన్ని ఆపి షాపులోకి వెళ్లాడు. ఒక్కసారిగా ద్విచక్రవాహనంలో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

నేలకొండపల్లి, జూలై28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శంకరగిరి చినతండాలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవటానికి ఓ కుటుంబం చేసిన ప్రయత్నాన్ని పోలీస్, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తండాకు చెందిన జర్పుల కృష్ణ తండాలోని డబుల్ బెడ్‌రూంల పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించటానికి సోమవారం ప్రయత్నం చేశారు. కుటుంబంతో సహా వచ్చి స్థలంలో ఉన్న చెట్లను నరికారు. గుడిసె వేయటానికి సిమెంటు కడ్డీలు పాతారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ రవి పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకొని, ప్రభుత్వ స్థలం ఆక్రమించుకోవడం నేరమని అడ్డుకున్నారు. దీంతో కృష్ణ కుటుంబ సభ్యులతో మందు డబ్బా పట్టుకుని మందు తాగుతామని బెదిరించారు. కానీ అధికారులు నచ్చచెప్పి ఆప్రయత్నాన్ని విరమింపజేశారు.

బీఎన్ఎస్ఎస్ చట్టాలను సవరించాలి

ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ఖమ్మంలీగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్) 2023 యాక్ట్‌లో నిందితులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే వెంటనే అరెస్టులు చేపట్టేలా సెక్షన్ 35(3)ని సవరించాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా సోమవారం 377 నిబంధన కింద ఈ అంశాన్ని ప్రస్తావించారు. గృహహింస, వరకట్న వేధింపులు మరియు సైబర్ నేరాల బాధితులపై సకాలంలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాధితులను రక్షించటానికి మరియు చట్ట నియమాలను నిలబెట్టటానికి సెక్షన్ 35(3)ను ఈ విధంగా సవరించాలని ఈ సవరణ చాలా ముఖ్యమైనదని ఎంపీ రఘురాం రెడ్డి కోరారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు

మంచుకొండ పీహెచ్‌సీని తనిఖీ చేసిన జడ్పీ సీఈవో దీక్షారైనా



వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో దీక్షారైనా

రఘునాథపాలెం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాదులు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో ముందస్తు వైద్య సేవలు అందించాలని జడ్పీ సీఈవో దీక్షారైనా ఆదేశించారు. సోమవారం మంచుకొండ పీహెచ్‌సీని జెడ్పీసీఈవో తనిఖీలు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న జ్వరాలు సర్వేలు, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. డాక్టర్ నిరోష, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఫార్మసిస్టు భవాని ప్రసాద్, ల్యాబ్ టెక్నిషియన్ కిషోర్ పాల్గొన్నారు.

కమ్మ కులంపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

నేలకొండపల్లి కాకతీయ కమ్మ సేవాసమితి

నేలకొండపల్లి, జూలై28(ఆంధ్రజ్యోతి): కమ్మ కులంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని నేలకొండపల్లి కాకతీయ కమ్మ సేవాసమితి సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. కమ్మ కులం వద్దనుకునే తుమ్మల నాగేశ్వరరావును వదిలించుకున్నామని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వాటిని సంఘం నాయకులు చవళం ప్రవీణ్‌కుమార్, అక్కినేని నాగేశ్వరరావు, మద్దినేని మహేష్ ఖండించారు. ఎన్టీయార్, చంద్రబాబు వద్ద కేసీఆర్ పని చేయలేదా అంటూ ప్రశ్నించారు. కమ్మ వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలను ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలన్నారు

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు గడువు 13వరకు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై28 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్‌యునివర్సిటీ ప్రవేశాలకు ఆగస్టు 13 వరకు గడువు ఉందని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. డిగ్రీ కోర్సులైన బీఏ, బీకాం, బీఎస్సీ తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంతోపాటు పలు పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రాంతీయ అద్యాయన కేంద్రం కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఉపాధి హామీని పరిరక్షించుకుందాం

వ్యకాసం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్, జూలై28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీని పరిరక్షించుకునేందుకు వర్గ పోరాటాలను బలోపేతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో వ్యకాస రూరల్ మండల నాలుగో మహసభ సోమవారం నిర్వహించారు. అనంతరం 27 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రనాయకులు పొన్నేకంటి సంగయ్య, ఐద్వా రాష్ట్ర నాయకులు పెండ్యాల సుమతి, యర్రా శ్రీనివాస్‌రావు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నంద్రా ప్రసాద్, మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, నందిగామ కృష్ణ, మాజీ సర్పంచ్‌లు తమ్మినేని కమలమ్మ, కోటయ్య, నాయకులు జక్కంపూడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 28(ఆంధ్రజ్యోతి): 1న నిర్వహించే కలెక్టరేట్‌ల వద్ద ధర్నాను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని యుఎస్పీసి జిల్లా స్టీరింగ్ కమిటీ కోరింది. సోమవారం నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే వేలాది మంది ఉపాధ్యాయులతో చలో హైద్రాబాద్ నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇళ్లపై సెల్ టవర్లకు అనుమతులు ఇవ్వొద్దు

కేఎంసీలో మేయర్ నీరజకు ఫిర్యాదు



ఖమ్మం కార్పొరేషన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): నివాసాలపై సెల్ టవర్లకు అనుమతులు ఇవ్వొద్దని మహిళలు మేయర్ పునుకొల్లు నీరజకు విన్నవించారు. రామచంద్రయ్యనగర్, ముస్తాఫానగర్, రామ్‌నగర్‌లో ఇష్టానురీతిగా సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్నారని, ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి అనుమతులు జారీ చేసే సమయంలో ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతిపత్రాలను తీసుకున్నారు. అజీజ్‌గల్లీలో కేవలం 40గజాల స్థలంలో రహదారులు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఈ కృష్ణలాల్, ఏసీపీ గంధం వసుంధర, టీఎంసీ పాల్గొన్నారు.



'సీతారామ'తో నియోజకవర్గం సస్యశ్యామలం

» ఎమ్మెల్యే మట్టా రాగమయి



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూలై28 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టుతో గోదావరి జలాలు, ఎన్టీఆర్ కెనాల్ ద్వారా బేతుపల్లి జలాల సాగునీటి రాకతో నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. మండలంలోని కాకర్లపల్లి శివారులోని బేతుపల్లి పెద్ద చెరువు '0' పాయింట్ వద్ద ఎన్టీఆర్ వరదనీటి కాలువకు నీటిని ఆమె పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కెనాల్ ద్వారా మొత్తం 54చెరువులు నిండనున్నాయని, సత్తుపల్లిలో 8చెరువుల కింద 2400ఎకరాలు, వేంసూరులో 46చెరువులకు గానూ 6400ఎకరాలకు సాగునీరు అందుతాయని, బేతుపల్లి చెరువు కింద 4,800ఎకరాలు కాగా మొత్తంగా 13,600ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటిలకు రైతుల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రైతుల అభ్యర్థన మేరకు కెనాల్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని, ఎస్టిమేట్, పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా లిఫ్ట్ వద్ద నుంచి ఇటు కాకర్లపల్లి, సత్తుపల్లి, బేతుపల్లి చెరువు వద్ద వెళ్లే మట్టి రోడ్లు గుంతలమయంగా మారాయని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. అనంతరం పట్టణంలోని పోస్టాపీస్ సెంటర్ వద్ద స్థానికులు ఎమ్మెల్యేను కలిసి ట్రాఫిక్ సమస్యను వివరించగా పరిశీలించాలని కమిషనర్ కే.నరసింహాను కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టండి..

సత్తుపల్లిరూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర కలిగిన సత్తుపల్లి నడిబొడ్డున ఉన్న రింగ్‌సెంటర్ రూపురేఖలు మారనున్నాయి. ఇక్కడ జరిగే ప్రమాదాలు, ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెడుతూ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో రూ.17లక్షలతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ నెల 19న ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్' శీర్షికన వెలువడిన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. కొద్దిరోజులుగా మొరాయించిన రింగ్‌సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను నూతనంగా ఏర్పాటు చేస్తుండటంతో పాటు నాలుగు రోడ్ల కూడలిగా అభివృద్ధి చేస్తున్నట్లు కమిషనర్ నరసింహ తెలిపారు. ఇప్పుడున్న రోడ్డును విస్తరణ చేస్తుండగా అయ్యగారిపేట రోడ్డు వైపు ఆటంకాలు లేకుండా వెళ్లేందుకు ఖమ్మం వైపు ఉన్న డివైడర్‌ను తీసివేశారు. అదేవిధంగా అశ్వారావుపేట వైపు డివైడర్‌ను కూడా సోమవారం తొలగించారు. విజయవాడ వైపు డివైడర్‌పై ఉన్న సుభాస్ చంద్రబోస్ విగ్రహం వరకు ఉన్న ఫౌంటేన్‌ను తొలగించి వెనుకవైపు ఏర్పాటు చేయడంతో పాటు రింగ్ సెంటర్‌ను మరింత విశాలంగా చేయనున్నారు. అదేవిధంగా పోస్టాపీస్ సెంటర్‌లో సైతం డివైడర్‌ను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తొలగించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. బస్టాండ్ సెంటర్‌లో నిత్యం ప్రమాదాలకు చెక్ పెట్టేలా మునిసిపాలిటీ ఆధునికీకరణ పనులు చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శంగా ఏన్కూరు గురుకులం

» పీఎంశ్రీలో ఎంపికైన పాఠశాల

» పూర్తయిన అభివృద్ధి పనులు



ఏన్కూరు గురుకుల విద్యాలయం

ఏన్కూరు, జూలై28 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కీం ఫర్ రైసింగ్(పీఎంశ్రీ)లో ఏన్కూరు గురుకుల పాఠశాల జిల్లాలోనే ఉత్తమ ఏకైక పాఠశాలగా ప్రథమస్థానంలో నిలిచింది. పాఠశాల పనితీరు, కార్యక్రమాల ఆధారంగా ప్రభుత్వం ఈపాఠశాలను ఎంపికచేసింది. పీఎంశ్రీ ద్వారా వచ్చిన దశల వారీ నిధులను ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దగ్గర ఉండి ప్రతిపైసా సద్వినియోగం అయ్యేలా చర్యలు చేపట్టారు. జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చేలా ప్రిన్సిపాల్ కృషిచేశారు. ఈవిద్యాలయంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 627 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం

పీఎం శ్రీలో చేసిన అభివృద్ధి పనులు

పులిగుండాల, రామప్ప, లక్నవరం పర్యాటక ప్రాంతాల ఫీల్డ్‌విజిట్, అటల్ టింకరింగ్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, సైన్సు, మ్యాథ్స్, ల్యాబ్‌ల ఏర్పాటు యూత్ క్లబ్, ఏకో క్లబ్ స్పోర్ట్స్, యాక్టివిటీ, సేఫ్టీ సెక్యూరిటీ విద్యార్థుల హాజరు వందశాతం ఉండడం విశేషం. పాఠశాల భవనాలకు తాత్కాలిక మరమ్మతులు పనులు, రంగులు వేయడం కిచెన్ గార్డెన్ ఏర్పాటు, వారాంతపు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్సు, సోషల్ క్లబ్‌ల ద్వారా విద్యార్థుల్లో నిమిడి ఉన్న ప్రతిభను వెలికితీయడం ఇక్కడి ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనం. వెబీఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా ప్రత్యేక విద్యాబోధన, టీఎల్ఎం ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు.

మోడల్‌పాఠశాలగా తీర్చిదిద్దుతాం

● ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి

పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్నాం. ఈ పాఠశాలను మోడల్‌పాఠశాలగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తా. ప్రతిపైసా పాఠశాల అభివృద్ధికి ఉపయోగించాం. నిధులు సద్వినియోగం అయ్యేలా చర్యలు చేపట్టడం జరిగింది. పీఎంశ్రీలో జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా ఎంపికకావడం సంతోషంగా ఉంది.

బాధిత కుటుంబాలకు మంత్రి పొంగులేటి పరామర్శ



వెంకటేశ్వర్లును పరామరిస్తున్న మంత్రి

తల్లాడ, జూలై28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండె బైపాస్‌సర్జరీ చేయించుకున్న కాంగ్రెస్ పార్టీనాయకుడు గోపిశెట్టి వెంకటేశ్వర్లును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి, తూము వెంకటనారాయణ, మాజీ ఉపసర్పంచ్ ఎర్రి నరసింహారావు, కాంగ్రెస్ నాయకుడు దుండేటి కేశవరెడ్డి,తుమ్మలపల్లి రమేష్, షేక్ యాకుబ్‌పాషా, ప్రముఖ వ్యాపారవేత్తలు జవ్వాజి నరిసింహారావు, నగేష్ పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

వైరా, జూలై 28 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం వైరా మునిసిపాలిటీ రెండో వార్డు బీసీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 45మంది విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. లయన్స్ కంటి ఆసుపత్రిలోని 25మంది శస్త్రచికిత్స చేయించుకున్న వారికి అల్పాహారం, రొట్టెలు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, చింతోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

ముదిగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేవిధంగా వైద్యసిబ్బంది కృషిచేయాలని నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బిందుశ్రీ సూచించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవల గురించి వైద్యాధికారి అరుణాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రామారావు, నాగరాజకుమారి, సత్యావతి పాల్గొన్నారు.

వసతిగృహం పరిశీలన

కొణిజర్ల, జూలై28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బస్వాపురం గ్రామ సమీపంలో గల గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహన్ని సోమవారం మండలాధికారులు సందర్శించారు. తహసీల్దార్ అరుణ, ఎంపీడీవో ఉపేంద్రయ్య, ఎంఈవో అబ్రహాంలు పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లుతామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలికల గురుకుల వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా సడియం

పెనుబల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా ఏడో మహాసభ ఆదివారం ఖమ్మంలో జరిగింది. ఈ సభలో పెనుబల్లి మండలం గట్టుగూడెం గ్రామానికి చెందిన సడియం నాగేశ్వరరావును జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల సీపీఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, నాయకులు పొదిలి భాస్కర్ అభినందనలు తెలిపారు. ఏజన్సీ ప్రాంతమైన పెనుబల్లి మండలం నుంచి నాగేశ్వరరావు గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఉద్యమాలు మరింత బలోపేతంగా నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

పెనుబల్లి గిర్దావర్-2గా పూర్ణచంద్రరావు బాధ్యతలు

పెనుబల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం గిర్దావర్-2గా ఆర్డీవో కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన పూర్ణచంద్రరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ నారాయణమూర్తి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. 15 రోజుల క్రితం ఇద్దరు గిర్దావర్‌లు ఒకేసారి బదిలీ అయ్యారు. వారి స్థానంలో వేరే వారిని నియమించినప్పటికీ వారు బాధ్యతలు స్వీకరించకపోవడంతో పూర్ణచంద్రరావు, సక్రులను గిర్దావర్‌లుగా పెనుబల్లికి బదిలీ చేశారు. మరో గిర్దావర్ సక్రు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ నారాయణమూర్తి తెలిపారు.

వాయిదాపడిన వేలం

కారేపల్లి, జూలై28(ఆంధ్రజ్యోతి): కోటమ్మైసమ్మతల్లి ఆలయంలో సోమవారం జరగాల్సిన కొబ్బరికాయల వియక్రయాలకు సంబంధించిన వేలంపాటలు వాయిదపడ్డాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సాపట్టాబీ రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో సిబ్బంది వేలం పాటలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే వేలంపాట పాడెందుకు ఎవరుముందుకు రాకపోవడంతో వాయిదవేసినట్లు తెలిపారు. తిరిగి ఆగస్టు నెల 7న నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, సాయి, పూజారి కైలాష్ శర్మ పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

» సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి



మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రశాంతి

మధిర, జూలై28: ర్యాగింగ్ చట్టరీత్యా నేరం అని అనవసరంగా ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని మండల లీగల్ సర్వీస్ సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యా యాధికారి యన్.ప్రశాంతి విద్యార్థులకు ఉద్బో ద చేశారు. సోమవారం మధిరలోని శ్రీనిధి డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలేజీలోకి కొత్తగా వచ్చిన జూనియర్స్‌ను పరిచయం చేసుకునే కార్యక్రమంలో శృతి మించి వ్యవహరించడం, అవమానకరంగా మాట్లాడటం, బెదిరించడం, లాంటి చర్యలు చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అనిల్ కుమార్ నెహ్రూ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, పాల్గొన్నారు.

కళాకారులు, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న వైరా

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మొదటి నుంచి కళాకారులు, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న చరిత్ర వైరాది అని స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరాలో కళాకారులు, క్రీడాకారులకు కొదవ లేదన్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావుతో కలిసి ఆదివారం రాత్రి ఎస్‌వీఎస్ గార్డెన్‌లో వైరా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం సీనియర్ కళాకారులను, భగవద్గీత కంఠస్థ పారాయణంలో బంగారు పతకాలు సాధించిన మహిళలను సన్మానించారు. చిన్నారుల నృత్యప్రదర్శనలు, కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఖమ్మం కళావేదిక నిర్వాహకుడు నాగబత్తిని రవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్.సోందుసాహెబ్, వర్తకసంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, నాగబత్తిని రవి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీనియర్ పాత్రికేయుడు పారుపల్లి కృష్ణారావు, నంది అవార్డు గ్రహీత కె.దేవేంద్ర, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సిద్ధంగా ఉండాలి

» సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

కొణిజర్ల, జూలై28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల పోరుకు సీపీఐ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్పష్టం చేశారు. సోమవారం కొణిజర్లలోని దొండపాటి భవనంలో సీనియర్ నాయకులు వెంపటి పరుశరాములు అధ్యక్షతన జరిగిన సీపీఐ మండల సమితి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్థానిక సంస్థ ఎన్నికలను ఎప్పుడు నిర్వహించిన పార్టీ శ్రేణులు కష్టపడి గెలిచేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, దొండపాటి రమేష్, మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, మణిగ కోటేశ్వరరావు, సుదర్శన్, పివిరావు, వేముల కొండ రమేష్, సరోజిని తదితరులున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మధిర రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై విద్యార్థులంతా అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులు, ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని సైబర్ క్రైం అధికారి బి.అశోక్, ఆర్.ప్రకాశరావు సూచించారు. సోమవారం మధిర మండలం మడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసుశాఖ వారి సౌజన్యంతో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తోట నర్సింహారావు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనర్హులను జాబితా నుంచి తొలగించాలి

మధిర రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఖమ్మంపాడు గ్రామంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని వారిని జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఖమ్మంపాడు గ్రామస్థులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సీపీఎం నాయకులైన బాజినేని వెంకటనర్సయ్య, అమరయ్య, లాలు ఆధ్వర్యంలో పలువురు ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. నిజమైన లబ్ధిదారులను విస్మరించి ఆర్థికంగా, బలమైన వారికి ఇళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. అనర్హులకు ఇచ్చిన ఇళ్లను రద్దుచేయాలని ఫిర్యాదు చేశారు.

త్వరలో ఉపాధ్యాయులకు పదోన్నతులు

» పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి

మధిర, జూలై28: త్వరలో ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మధిర హరిజనవాడ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పీఆర్టీయూ రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వంతో చర్చలు జరిపిందన్నారు. ఉపాధ్యాయ పదోన్నత షెడ్యుల్ లోనే, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టులను కూడా పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని సీఎంని కలిసినప్పుడు కోరడం జరిగిందని దీనికి సీఎం కూడా సానుకులత వ్యక్తం చేశారని అన్నారు.

'షీ రాక్స్' ప్రారంభం

ఎర్రుపాలెం, జూలై28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఇందిర క్రాంతి పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షీరాక్స్ జిరాక్సు సెంటర్‌ను మధిర మార్కెట్ కమిటీచైర్మన్ బండారు నరసింహారావు సోమవారం ప్రారంభించారు. జమలాపురం గ్రామం సమాఖ్యఆర్థిక సహకారంతో ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో కంప్యూటర్ ఆన్‌లైన్, డీటీపీ పనులు చేసేలా మహిళ, దివ్యాంగులకు ప్రభుత్వం అవకాశం కలిపించింది. దీనిలో భాగంగా జమలాపురం గ్రామానికి చెందిన అజ్మీర కావేరి అనే దివ్యాంగ మహిళను ఎంపికచేసి బ్యాంకు రుణం అదించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మన్నే ఉషాశారద, ఎంపీడీవో బి.సురేందర్, ఎంపీవో శ్రీలక్ష్మి, ఏపీఎం హరినారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు పాల్గొన్నారు.

'మామిడి చెట్లు అక్రమంగా నరకలేదు'

కల్లూరు, జూలై28 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో ఇటీవల ఓ మామిడి తోటలో తాము చెట్లు అక్రమంగా నరికినట్లు కొంత మంది వ్యక్తులు ప్రచారం చేయటం పట్ల కల్లూరుకు చెందిన తోక చిన్న అంజనేయరాజు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. 2014 లో చంద్రుపట్ల గ్రామానికి చెందిన మానాల రవికుమార్, యశోద కళ్యాణి నుంచి చంద్రుపట్ల రెవెన్యూ పరిధిలో గల భూమిని తాము కొనుగోలు చేశామని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నాడు. సదరు భూమిపై తమకు హక్కుపత్రాలు కూడా ఉన్నాయని, రైతుబంధు, రైతు భరోసా కూడా పొందుతున్నామని వివరించాడు. మామిడి తోటలో ఫలసహాయం కూడా పొందుతున్నామని తెలిపాడు. గత శుక్రవారం నాడుతమ పేరున గల భూమిలో మామిడి చెట్లు నరికిస్తుండగా, మానాల రవికుమార్ తనకు అమ్మిన ధర భూమికి రేటు విలువ పెరగటంతో ఆశపడి తిరిగి భూమిని వెనుక్కులాగాలని దుర్బుద్ధితో మామిడి తోట ప్రదేశంపైకి వచ్చి చెట్లు నరకుండా అడ్డువచ్చారని ఆరోపించాడు. తమ పేరున గల ఈ భూమిపై సాగు చేసుకునేలా తమకు న్యాయం చేయాలని ఆయన తన ప్రకటనలో ప్రభుత్వ అధికారులను వేడుకున్నాడు.

ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం అభినందనీయం

తల్లాడ, జూలై28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు తాళ్లూరి శ్రీనివాసరావు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంఈవో ఎస్.దామోదరప్రసాద్ కొనియాడారు. సోమవారం మండలంలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లడుతూ శ్రీనివాసరావు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రేరణ కల్పించడం వల్ల వారిలో చదవుపట్ల ఆసక్తి, సృజనాత్మకతశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లాల్‌సయ్యద్, గిరిజారాణి, శారదాదేవి, స్వరాజ్యలక్ష్మి, మురళీకృష్ణ, రామకృష్ణస్వామి, విద్యాధర, గోపాలరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న బీజేపీ

» సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ముదిగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. సోమవారం ముదిగొండలో జరిగిన సీపీఎం మధిర డివిజన్‌స్థాయి జనరల్‌బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్, బండి రమేష్, కల్యాణం వెంకటేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, బండి పద్మ, మడుపల్లి గోపాలరావు, బట్టు పురుషోత్తం, మంకెన దామోదర్, టీఎస్.కల్యాణ్, భద్రయ్య, నాగేశ్వరరావు, పద్మావతి, ప్రభావతి, బట్టు రాజు, మెట్టెల సతీష్, కట్టకూరి ఉపేందర్ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తేవాలి

» తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

కల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్ట తేవాలని సీపీఎం అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల పరిధిలోని యజ్ఞనారాయణపురం గ్రామంలో సోమవారం తన్నీరు కృష్ణార్జునరావు అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి అంజయ్య, జిల్లా నాయకుడు మాదల వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అర్హులైన వారందరికీ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ మహాసభలో కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శిగా దోమతొట్టి పుల్లయ్య, తన్నీరు కృష్ణార్జునరావులతో పాటుగా 13 మందితో కమిటీని వేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మోదుగు వెంకయ్య, సామినేని హనుమంతరావు, వీరభద్రం, బి బాబు, మండేపూడి వెంకటేశ్వరరావు తదితతరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిలోనూ సింగరేణిది కీలకపాత్ర

సత్తుపల్లిరూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తిలోనే విద్యుత్ ఉత్పత్తిలోనూ సింగరేణిది కీలకపాత్ర అని ఏబీకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి, వేతన బోర్డు సభ్యుడు పీ.మాధవనాయక్ అన్నారు. సోమవారం స్థానిక జేవీఆర్ ఓసీలో సింగరేణి కోల్‌మైన్స్ సంఘం (ఏబీకేఎంఎస్-బీఎంఎస్) ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు పర్యటించిన అనంతరం గేట్ మీటింగ్ నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. దేశాభివృద్ధికి విద్యుత్ అత్యవసరం కాగా విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు ప్రధాన ఇందనంగా ఉందని, అయితే ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ యాజమాన్యాలు తప్పుడు విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్‌సీఎంకేఎస్ ముఖ్య సంఘటన కార్యదర్శి, స్టాండరైజేషన్ కమిటీ మెంబర్ టీఎస్.పవన్‌కుమార్, ఎస్‌సీఎంకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు రామ్‌సింగ్ పాల్గొన్నారు.

పెసర, పత్తి పంటల పరిశీలన

కొణిజర్ల, జూలై28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగోపతి గ్రామంలో రైతులు సాగు చేసిన పెసర, పత్తి పంటలను సోమవారం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య పరిశీలించారు. రైతులకు వర్షాలుపడుతున్న దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. తెగుళ్ల సోకిన మొక్కలను వెంటనే పీకి కాల్చివేయాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాలాజీ, ఏఈవో శ్రీనివాస్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

సుస్థిర పట్టణాభివృద్ధి సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ

సత్తుపల్లిరూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి): సుస్థిర పట్టణాభివృద్ధి సాధనే లక్ష్యంగా అందరూ భాగస్వాములవ్వాలని మునిసిపల్ కమిషనర్ కే.నరసింహ కోరారు. సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్, ఏఈ సురేష్, సిబ్బంది ప్రసాద్, నరేష్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

టిన్నర్ ఆయిల్ స్వాధీనం

తల్లాడ, జూలై28 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని ఎన్టీఆర్‌నగర్ సమీపంలో పాతఇనుము షాపు ముందు 200 లీటర్ల టిన్నర్ ఆయిల్‌ను సోమవారం ఎస్ఐ వెంకటకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. పాత ఇనుము షాపు ముందు బ్లూ కలర్ ప్లాస్టిక్ డబ్బాలో ఉన్న టిన్నర్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

చింతకాని, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామ సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో కారు పూర్తిగా దగ్ధమైంది. ఖమ్మం నగరానికి చెందిన దొబ్బల రంగారావు కారులో బోనకల్ నుంచి ఖమ్మం వెళ్తుండగా పందిళ్లపల్లి గ్రామంలోకి చేరుకోగానే కారు ఇంజన్‌లో నుండి పొగలు వస్తుండటంతో వెంటనే కారు నిలిపాడు. కారు దిగగానే భారీగా మంటలు వ్యాపించాయి. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం నుంచి బాధితుడు బయటపడటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

'విజయ'లో ముగిసిన ఏఐ శిక్షణ

కొణిజర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విజయ ఇంజనీరింగ్ కళాశాల, మైస్పార్క్ అకాడమీతో ఒప్పదం మేరకు నెల రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ముగిసింది. సోమవారం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఏఐ మరియు జెన్‌ఏఐ కోర్సు మీద శిక్షణ ఇచ్చారు. ఏడు రకాల రియల్ టైం ప్రాజెక్ట్ జెన్ ఏఐ టూల్స్‌ఉపయోగించుకొని అభివృద్ధి చేశామని కళాశాల సీఈవో శ్రీ కవిత ఎర్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి హర్షసింగ్, సీటివో, స్పీడ్‌లాబ్స్ మరియు ఫాతిమా, ప్రాజెక్ట్‌కి జడ్జిగా వ్యవహరించారు. కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ మాట్లాడుతూ నిజ జీవితంలో విద్యార్థులకు మరియు సామాన్య ప్రజలకు ఉపయోగపడే యాప్స్ చేయటం చాలా అభినందనీయమని, మైస్పార్క్ అకాడమీ సీఈవో శ్రీకవిత శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ చైర్ పర్సన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ అయేషా తరుణం, డీన్.డాక్టర్ శ్రీనివాస్, ఏవో డాక్టర్ పరీద్‌బాబా, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం